# విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 23 ఆగస్టు 2025 8 పేజీలు


# మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం...జనసేవాదళ్ లక్ష్యం

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్

**ఏలూరు - నరసాపురం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో జనసేవాదళ్ శిక్షణ శిబిరం హనుమాన్‌నగర్ ప్లాట్లలో శుక్రవారం నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర 28వ మహాసభల సందర్భంగా ఒంగోలు నగరంలో 23వ తేదీ జరగనున్న ప్రజా ప్రదర్శన, బహిరంగ సభల సందర్భంగా ప్రజా ప్రదర్శనలో అగ్రభాగాన రెడ్ షర్ట్ వలంటీర్లు కవాతు చేస్తారని, అందులో భాగంగా ఏలూరు ఏరియా ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చేందుకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ మహాసభలతో పాటు సమాజంలో ప్రజల పైన జరిగే దాడులకు వ్యతిరేకంగా, మతోన్మాద శక్తుల ఆగడాలకు వ్యతిరేకంగా, ప్రజలకు రక్షణ కల్పించడానికి, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు సహాయం అందించడానికి జనసేవాదళ్ కార్య కర్తలు పని చేస్తా రని తెలిపారు. అటువంటి మహ త్తర ఉన్నత లక్ష్యా లకు అనుగుణంగా జనసేవాదళ్ సభ్యులు పనిచేయా లని పిలుపు నిచ్చారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయడానికి ఏలూరు ఏరియా సమితి జనసేవాదళ్ వలంటీర్స్ కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ చేతుల మీదుగా జిల్లా సమితి అందించిన రెడ్ షర్ట్ వలంటీర్స్ యూనిఫామ్‌ను శిబిరంలో పాల్గొన్న వారికి అందించారు. ఈ శిక్షణా శిబిరంలో ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కూరెళ్ళ నాగ దుర్గా వరప్రసాద్, మెకానికల్ యూనియన్ కోశాధికారి, ఏఐటీయూసీ నగర నాయకులు ▶మిగతా 2లో..

# ముంచుకొస్తున్న ముప్పు

- ఆందోళనలో లంక గ్రామాల వాసులు
- నీటమునిగిన అప్పనపల్లి కాజ్ వే
- కలవరపెడుతున్న కరకట్టలు

**విశాలాంధ్ర - కాకినాడ/మామిడికుదురు :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో లంక గ్రామాల ప్రజలు భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద ప్రమాదకర స్థాయిలో వరద ఉధృతి కొన సాగుతూ ఉండటంతో అధికార యంత్రాంగం ▶మిగతా 2లో..

# భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

### కలెక్టర్ పి. ప్రశాంతి

**విశాలాంధ్ర - తూర్పుగోదావరి :** జిల్లాలో భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. బొమ్మూరు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. భూగర్భ జలాల పరిరక్షణపై వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో ప్రీ-మాన్సూన్ భూగర్భ జల స్థాయి 8 మీటర్ల కంటే ఎక్కువ లోతులో ఉన్న గ్రామాల్లో భూగర్భ జలాలు రీచార్జ్ అయ్యేలా ఉపాధి హామీ పథకం కింద ప్రత్యేక పనులు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 80 గ్రామాల్లో భూగర్భ జలాలు నిర్ధారిత స్థాయిలో కంటే ఎక్కువ లోతులో ఉన్నట్లు భూగర్భ జలాల విభాగం సర్వేలో తేలిందని ఆమె వివరించారు. ఈ గ్రామాల్లో చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, పెర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జ్ పిట్‌లు వంటి వాటర్ కన్జర్వేషన్ పనులు చేపట్టి జలాల పునరుద్ధరణకు కృషి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 1 నాటికి జిల్లాలో ఎంత మేరకు నీరు నిల్వలో ఉందో, ఎంత మేరకు కన్జర్వేషన్ పనులు జరిగాయో వివరాలతో "వాటర్ బులెటిన్" సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాల్సి ▶మిగతా 2లో..

# కోస్టల్ జోన్ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్ చదలవాడ నాగరాణి

**విశాలాంధ్ర -భీమవరం:** జిల్లాలో తీరప్రాంత నియంత్రణ జోన్ ఉల్లంఘనపై అందిన ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో తీరప్రాంత నియంత్రణ జోన్ ఉల్లంఘనకు సంబంధించిన మూడు అంశాలపై కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్షించారు. నర్సాపురంలోని వశిష్ట గోదావరి నది ఒడ్డున ఘన వ్యర్థాలను పారవేయడంపై నర్సాపురం మండలం పీచుపాలెం, లక్ష్మణేశ్వరం గ్రామాలలో అక్రమ రొయ్యల పొలాలపై దేవేంద్ర ఫణికర్ ఓసూరి ఫిర్యాదులు, మొగల్తూరు మండలం, కె.పి. పాలెం సౌత్ గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకం, అనధికార రొయ్యల చెరువు తవ్వకం గురించి ఎ.వి.వి. సత్యనారాయణ చేసిన ఫిర్యాదులు, ఆంధ్రప్రదేశ్ పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖకు 2025 సెప్టెంబరు 20న బీచ్ క్లీనింగ్ కార్యకలాపాలు ప్రచారాలను నిర్వహించడానికి నోడల్ అధికారిని నియమించి తెలియజేయడంపై సమీక్షించడం జరిగింది. వసిష్ట నది దాని వరద ఒడ్డున చెత్త డంప్ ను స్వచ్ఛభారత్ కింద లెగసీ వేస్ట్ 50 వేల మెట్రిక్ టన్నులను ఇప్పటికే నిర్మూలించడం జరిగిందని నరసాపురం మున్సిపల్ కమిషనర్ సమావేశంలో ▶మిగతా 2లో..

# సాంకేతిక లోపం... శెట్టిబలిజలకు శాపం

### సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి

**విశాలాంధ్ర - కాట్రేనికోన :** రాష్ట్రంలో శెట్టి బలిజ కులం సర్టిఫికెట్ల జారీలో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆ సామాజిక వర్గానికి శాపంగా మారింది. ఎంతో చరిత్ర ఉన్న శెట్టిబలిజ సామాజిక వర్గం వారు కులం సర్టిఫికెట్ పొందాలంటే ఇటీవల అన్నీ అవాంతరాలు, ఇక్కట్లే ఎదుర్కోవలసి వస్తోంది. శెట్టిబలిజ జాతిపిత కీర్తిశేషులు దొమ్మేటి వెంకటరెడ్డి ఉద్యమాల ఫలితంగా ఆనాడు ఈడిగ అని పిలిచే ఈ సామాజిక వర్గాన్ని శెట్టిబలిజ కులంగా మార్చారు. 1920లో బోడసకుర్రు గ్రామంలో జరిగిన సామాజిక సమావేశంలో శెట్టిబలిజ పేరును అధికారికంగా ప్రకటించారు. అప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సామాజిక వర్గాన్ని బీసీ బీగా గుర్తించి శెట్టిబలిజ కులం సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం తెలంగాణలో శెట్టిబలిజలను అదర్ బ్యాక్వర్డ్ ▶మిగతా 4లో..

# ముసునూరు రోడ్డుకు మరమ్మతులైనా చేయండి

### ప్రయాణికుల వేడుకోలు

**విశాలాంధ్ర-ముసునూరు :** ముసునూరు రోడ్డులో ఏర్పడిన గోతులు పూడ్చి కనీసం మరమ్మతులైనా చేయించండి అంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూజివీడు నుండి జిల్లా కేంద్రం ఏలూరుకు వయా ముసునూరు మీదుగా వెళ్లే ప్రధాన రహదారిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో కొద్దిపాటి వర్షానికే నీళ్లు నిలబడి చెరువులను తలపిస్తున్నాయని గొయ్యి ఏదో, రోడ్డు ఏదో తెలియకుండా ఉందని ఇక ఈ రోడ్డులో ప్రయాణం అంటే కత్తి మీద సాములా మారిందని వాహనదారులు అంటున్నారు. ముసునూరు మండలంలోని 16 గ్రామాల ప్రజలతో పాటు నూజివీడు మండలంలోని పోతిరెడ్డిపల్లి, ముక్కొల్లుపాడు తదితర గ్రామాల ప్రజలు కూడా ప్రతి చిన్న అవసరానికి నూజివీడుకు వెళ్లాలంటే దినదిన గండంగా మారిన ఈరోడ్డులోనే ప్రయాణించాల్సి ఉంటుంది. మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతినిత్యం విధులకు హాజరయ్యే అధికారులు, సుపరిపాలనలో తొలి అడుగు అంటూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పే కూటమి నాయకులు ప్రతినిత్యం ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్నప్పటికీ రోడ్డు అభివృద్ధి పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడ మేమిటని స్థానిక గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత నూజివీడు శాసనసభ్యులు, రాష్ట్ర గృహ నిర్మాణ పౌర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పలు అభివృద్ధి ▶మిగతా 2లో..

## పాతూరి నాగభూషణం జయంతి

**విశాలాంధ్ర-ఏలూరు:** స్వాతంత్ర్య సమరయోధులు, గ్రంథా లయ ఉద్యమ నాయకులు, కళా ప్రపూర్ణులు పాతూరి నాగభూషణం 118వ జయంతి పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహిం చారు. కార్యక్ర మానికి పాఠశాల ప్రధానోపాధ్యా యులు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహిం చారు.

ఈ సంద ర్భంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాలలో గ్రంథాల యాల ఏర్పాటుకు వయోజన విద్యా వ్యాప్తికి కృషిచేసిన త్యాగధనుడు స్వాతంత్ర్య సమరయోధుడు పాతూరి నాగభూ షణం అన్నారు. ప్రధాన వక్త, ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ నాయకులుగా, అనువాదకులుగా, సంపాద కులుగా, ప్రచు రణకర్తగా సామాజిక వారిగా నాగభూషణం ఎనలేని సేవలు అందించారని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహు మతులను అంద జేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథా లయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగార్జున, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత పాతూరి నాగభూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## మరమ్మతులైనా చేయండి (1వ పేజీ తరువాయి)

కార్యక్రమాలపై ముసునూరు మండలానికి రావాల్సి ఉంటే అటు తుక్కులూరు వైపు నుంచి, లేదా వలసపల్లి వైపు నుంచి, లీలానగర్ అడ్డరోడ్డు వైపు నుండి, బైపాస్ లో నుండి డైరెక్ట్ గా మండలానికి వస్తున్నారని,ఈ రోడ్డులో ప్రయాణం చేస్తే తప్ప ఈ రోడ్డు పరిస్థితి వారికి అర్థం కాదని మండలవాసులు పేర్కొంటున్నారు. ప్రధానంగా సింహాద్రిపురం-గోపవరం సెంటర్లలో ఏర్పడిన గోతుల్లో బురద మట్టి చేరడంతో వాహనాలు అదుపుతప్పి అనేకమంది ప్రయాణికులు ప్రమాదాల బారిన పడి కాళ్ళు, చేతులు విరగొట్టుకుంటున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయంటున్నారు. అత్యవసర సమయంలో మెరుగైన వైద్యం కోసం రోగులను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాలన్నా ఈ రోడ్డులో ప్రయాణించే పరిస్థితి లేదని, కుటుంబ సమేతంగా భార్యాపిల్లలతో ఏదైనా కుటుంబ అవసరాల నిమిత్తం నూజివీడుకు వెళ్లాలన్నా తుక్కులూరు మీదుగా జంక్షన్ రోడ్డుకి వెళ్లి ఐదు కిలోమీటర్ల ఎక్కువ దూరం తిరిగి వెళ్లాల్సి వస్తుందంటున్నారు. మండలంలోని రెక్కాడితే గాని డొక్కాడని కొన్ని గ్రామాల చిన్న, సన్నకారు రైతులు తాము పండించిన కూరగాయ ఉత్పత్తులు ఒకటి రెండు బస్తాలను నూజివీడు మార్కెట్ కు మోటార్ సైకిల్ పై కట్టుకొని ఈ మార్గం గుండా వెళ్లే పరిస్థితి లేదని, అసలే గిట్టుబాటు ధర లేని కూరగాయ ఉత్పత్తులలో మిగిలిన సొమ్మును ఆటోలకు చెల్లించి నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతులు తమ గోడు వెళ్ళబుచ్చుకుంటున్నారు. జంగారెడ్డిగూడెం -చింతలపూడి వంటి సుదూర ప్రాంతాల రైతాంగం కూడా తాము పండించే కొబ్బరి, మామిడి, అరటి తదితర పంటలను రాష్ట్ర రాజధాని అమరావతికి తరలించేందుకు దగ్గర మార్గం కావడం చేత ఈ మార్గాన్నే అనుసరించడంతో నిత్యం ఈ మార్గంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి అంటున్నారు. నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారిని అభివృద్ధి చేయా లంటూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాల్లో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ, నేలపాటి వారికుంట, సింహాద్రిపురం సెంటర్లలో పలుమార్లు రాస్తారోకోలు నిర్వహించినా నేటికీ ఫలితం లేదని, ప్రజల పట్ల పాలకులకు ఉన్న చిత్తశుద్ధికి ఈ నిర్లక్ష్య వైఖరే నిదర్శనమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు అన్నారు.

**నూజివీడు-ఏలూరు రహదారి అభివృద్ధికి సీపీఐ నాయకుల ఆరా**

**ఆర్ అండ్ బి డీఈ సిహెచ్ బాబూరావు వివరణ**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని 13 రోడ్ల అభివృద్ధికి సంబంధించి టెండర్లను ప్రభుత్వం పిలువగా హైదరాబాదుకు చెందిన వృద్ధి ఇన్ఫ్రాటెక్ - రిత్విక్ కంపెనీవారు టెండర్ దక్కించుకున్నారు. ఈ క్రమంలో నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారి అభివృద్ధి పనులు అప్పటి శాసనసభ్యులకు చెందిన వ్యక్తులు టెండర్ దక్కించుకున్న హైదరాబాద్ వృద్ధి ఇన్ఫ్రాటెక్ - రిత్విక్ కంపెనీ వారి వద్ద నుండి సబ్ కాంట్రాక్టుకు తీసుకొని సకాలంలో పని పూర్తి చేయకపోవడంతో రోడ్డు పరిస్థితి ఇలా మారిందని డిప్యూటీ ఇంజనీర్ సిహెచ్ బాబూరావు వివరణ ఇచ్చారు. సదరు కాంట్రాక్టర్ ప్రస్తుతం మెటీరియల్ ధరలు పెరగడంతో గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ కాంట్రాక్టు పూర్తి చేయలేనని, పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లిస్తేనే సదరు కాంట్రాక్టు పనులు పూర్తి చేస్తామన్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ రోడ్డు పరిస్థితిని మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకు వెళ్లగా గోతులు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని సూచించడంతో నూజివీడు నుండి 22 కిలోమీటర్ల 260 మీటర్లమేర రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులకుగాను 95 లక్షల రూపాయలతో అంచనా వేసి అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు వివరించారు.

## జనసేవాదళ్ లక్ష్యం (1వ పేజీ తరువాయి)

కాటూరి శ్రీధర్, ఏరియా కార్యవర్గ సభ్యులు గొర్లి స్వాతి, శాయన అభిలాష్ కుమార్, 16వ డివిజన్ సభ్యులు ఉప్పులూరి కేశవరావు, ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్స్ యూనియన్ అధ్యక్షులు తమ్మిశెట్టి రమణయ్య, కొండేటి రాంబాబు, గొర్లి పూజిత్ సాయి, ఉప్పులూరి లక్ష్మి, భవాని, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తీసుకోవాలి (1వ పేజీ తరువాయి)

వివరించారు. ఈ విషయమై కలెక్టర్ మాట్లాడుతూ ఒక మీటరు ఎత్తు వరకు అక్కడ ఉన్న మట్టిని మిషనరీ తో పెకిలించి వ్యర్థాలను పూర్తిస్థాయిలో తీసివేసిన అనంతరం కొత్త మట్టిని నింపి, గ్రీనరీని వెంటనే అభివృద్ధి చేసి నివేదిక సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. సమావేశంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి కె.వెంకటేశ్వర రావు, డిఈ ఎన్.వెంకటరమణ, ఏఈ ఎస్.రమేష్, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక చర్యలు (1వ పేజీ తరువాయి)

ఉందన్నారు.

**స్వామిత్వ సర్వే**

గ్రామ కంఠాల్లో ఇళ్లకు, ఖాళీ స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు చేపట్టిన "స్వామిత్వ సర్వే"ను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రెండో దశలో 102 గ్రామాల్లో రీ-సర్వే జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు 65 గ్రామాల్లో పూర్తయ్యిందని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు.

**న్యాయ వ్యవస్థ బలోపేతం**

జిల్లాలో ఖాళీగా ఉన్న పీపీ, ఏపీపీ, జీపీ, స్పెషల్ కౌన్సిల్ వంటి కీలక న్యాయ పదవులను భర్తీ చేసేందుకు జిల్లా జడ్జి ప్రతిపాదించిన ప్యానెల్ను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. ఈ నియామకాలతో ప్రభుత్వ తరపున న్యాయ వ్యవహారాల నిర్వహణ వేగవంతం అవుతుందని, ప్రజలకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని ఆమె అన్నారు.

**స్వర్ణాంధ్ర విజన్ 2047**

కీలక పనితీరు సూచికలు ఇప్పటికే రూపకల్పన చెయ్యడం జరిగిందని, వాటి వివరాలు శాఖల వారీగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. అందుకు అనుగుణంగా భవిష్యత్తు పనితీరు ఉండాలని స్పష్టం చేశారు.

ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పారదర్శకతతో, వేగవంతమైన పరిపాలనతో ముందుకు సాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ .చిన్న రాముడు, డీఆర్వోటి .సీతారామమూర్తి, ఎస్డీసీ ఎస్.భాస్కర్ రెడ్డి, సీపీవో ఎల్.అప్పలకొండ, డివిజనల్ అభివృద్ధి అధికారులు పి.వీణా దేవి, ఎ.స్లీవా రెడ్డి, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ బి. లక్ష్మీ నారాయణ, జిల్లా గ్రామపంచాయతీ అధికారి వి. శాంతమణి , డిఐ పీఆర్వో కే లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ముంచుకొస్తున్న ముప్పు (1వ పేజీ తరువాయి)

అప్రమత్తమైంది. దీంతో వైనతేయ, వశిష్ట, గౌతమి నదులు వరదనీటితో జలకళను సంతరించుకొన్నాయి. గతంలో 2022 సంవత్సరంలో వచ్చిన వరద మహోగ్రరూపం దాల్చి కోనసీమ వాసుల కంటిమీద కునుకులేకుండా చేసింది. లంక గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో వారు నాటు పడవల్ని ఆశ్రయించి రాకపోకలు సాగిస్తున్నారు. లంక గ్రామాలలో ఉన్న విద్యార్థులు ఆ నాటు పడవలపై పాఠశాలకు వెళ్తుండడంతో తల్లిదండ్రులు, కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. గోదావరికి వరద ప్రవాహం పెరగడంతో అధికారులు ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా రాకపోకలకు అనుగుణంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో పడవలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రస్తుతానికి ఆ దిశగా అటువంటి చర్యలేవీ కనిపించడం లేదని లంక వాసులు అంటున్నారు.

**నీటమునిగిన కనకాయలంక కాజ్వే**

**రాకపోకలకు అంతరాయం**

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు అనుసంధానంగా ఉన్న పి గన్నవరం మండలంలోని చాకలిపాలెం శివారు కరకట్ట దిగువన ఉన్న కనకాయలంక కాజ్వే పై వరద నీరు పొంగి ప్రవహిస్తూ ఉండటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కనకాయలంక గ్రామంలో ఉన్న ప్రజలంతా తమ రోజువారీ పనులు, పాఠశాలకు వెళ్ళే విద్యార్థులు ఈ కాజ్వే పైనే చాకలిపాలెం రావాల్సి ఉంటుంది. వరద ఉధృతి పెరిగితే తమకు రాకపోకలు సాగించేందుకు అధికారులు ఇంజిన్ బోట్లను ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

**వైనతేయ నదికి పెరుగుతున్న వరద ఉధృతి**

వైనతేయ నదికి క్రమేపీ వరద ఉధృతి పెరుగుతూ ఉండటంతో నదీ తీర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. మామిడికుదురు మండల పరిధిలోని నదీతీరం వెంబడి ఉన్న గ్రామాల్లో పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి ఆలయం వద్ద ఉన్న పుష్కర స్నానం ఘట్టంపై వరద నీరు చేరడంతో దేవస్థానంసిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తులు గోదావరిలో స్నానమచరించకుండా అక్కడ సిబ్బందిని నియమించారు. ఈ కాజ్ వే నీట మునగడంతో బీ దొడ్డ వరం, అప్పనపల్లి, పెదపట్నం లంక గ్రామాల ప్రజలకి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కూరగాయల పంటలు వరద నీట మునిగి కుళ్ళిపోవడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది.

**ఏటిగట్లు (కరకట్టలు) రక్షణగా నిలుస్తాయా**

2022 సంవత్సరంలో వరద నేర్పిన పాఠాలు అధికారులకు కనువిప్పు కలిగించాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే వరద ధాటికి తట్టుకునే లంక వాసులకు రక్షణ కవచంలా ఉండే ఏటిగట్లు (కరకట్టలు) ఈ సారి వచ్చే వరదలకి తట్టుకుని నిలబడగలదా అన్న అనుమానం లంక గ్రామాల వాసుల్లో నెలకొంది. అప్పట్లో పి గన్నవరం మండల పరిధిలోని నాగుల్లంక, రాజోలు మండల పరిధిలోని సున్న వారి బాదవ, మామిడికుదురు మండలం పరిధిలోని పెదపట్నం, పాశర్ల పూడి లంక వద్ద ఏటిగట్ల లీకేజీ ఏర్పడటంతో లంక గ్రామాల ప్రజలు కంటిమీద కునుకులేకుండా చేసింది. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోనసీమ జిల్లాలో పర్యటించి ఏటిగట్ల పరిస్థితిపై అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కోట్లాది రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ నిధుల లేమితో ఏటిగట్టు పటిష్టతపై ఎటువంటి పురోగతి కనిపించలేదు. గత వేసవిలో ఇష్టారాజ్యంగా లంకల్లో ఉన్న మట్టిని మట్టిమాఫియా దర్జాగా తవ్వుకొని ఇష్టారాజ్యంగా కరకట్టల పై రవాణా సాగించడంతో పలుచోట్ల ఏటిగట్టు కుంగిపోయి, బీటలువారి కలవరపెడుతున్నాయి. దీంతో ఏ సమయంలో ఏటువంటి ఉపద్రవం ముంచుకొస్తోంది అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అప్రమత్తం**

గోదావరి వరదల నేపథ్యంలో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అప్రమత్తమయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నానో విధానాన్ని పాటించి అధిక ప్రయోజనం పొందాలి

**విశాలాంధ్ర-లింగపాలెం:** నానో విధానంతో వ్యవసాయ పంటలకు ఎరువులను అందించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చింతలపూడి వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు వై. సుబ్బారావు తెలిపారు. ప్రధా నంగా వ్యవ సాయ పంటలకు యూరియా, డి.ఏ.పిలను అధికంగా వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఈ ఎరువులను నానో విధానంలో వినియోగించాలని వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ఎరువులకు సబ్సిడీ ఇవ్వటం వల్ల రైతులు అత్యుత్సాహంతో అధికంగా వీటిని పంటలకు వాడుతున్నారని దీనివల్ల అన్ని విధాలుగా నష్టం జరుగుతుందని పంట ఉత్పత్తులు,నేల కలుషితమవుతున్నాయని వివరించారు. యూరియా, డిఎపి ఎరువులను నేరుగా చల్లకుండా నానో (లిక్విడ్) విధానంలో వినియోగించడం వల్ల ప్రయోజనాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. నానో విధానం వల్ల80 శాతం పంటకు అందుతుందని నేరుగా చల్లటం వల్ల 40 శాతం మాత్రమే ఉపయోగపడుతుందని అన్నారు. వీటిపై అనేక పరిశోధనలు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిందని దీనివల్ల వచ్చిన ఫలితాలను బట్టి నానో విధానాన్ని ప్రవేశ పెట్టినట్టు తెలిపారు. మారుతున్న కాలమాన పరిస్థితులను బట్టి వ్యవసాయ విధానాలను పాటించడంలో కొత్త ఒరవడిని రైతులు అలవాటు చేసుకోవాలని కోరారు.

## బాలికలకు రుతు రుమాళ్ల పంపిణీ

**విశాలాంధ్ర - ఉంగుటూరు:** ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శు క్రవారం బొమ్మిడి, ఉంగుటూరు ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లోని 90 మంది బాలికలకు రుతు రుమాళ్ళు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమెన్ ట్రస్టు డైరెక్టర్ ఇవాంజలి మాట్లాడుతూ బాలికలు రుతు క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో వార్డెన్ మాధవి, బాల, కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలి

**విశాలాంధ్ర-భీమడోలు:** బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. భీమడోలు రైతు సేవా సహకార సంఘంలో పర్సన్ ఇంచార్జ్ , ఆప్కాబ్ చైర్మన్ అయిన గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో త్రీమెన్ కమిటీ సభ్యులైన వెజ్జు రాంబాబు, గేదల శ్రీనివాసు, డిసిసిబి ఏలూరు సిఈఓ సింహాచలం, బ్యాంక్ సిఈ ఓ నాగేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ త్వరలో బాంకు పరిధిలో బంగారం కుదవపై రుణ సౌకర్యం కల్పించనున్నారన్నారు. బ్యాంకులో రుణం పొందిన రైతులకు ఎరువులపై సంవత్సర కాల పరిమితిపై ఇప్పటి వరకు 16శాతం ఉన్న వడ్డీ 14శాతం ఇచ్చేలా పరిశీలిస్తామని అన్నారు.వడ్డీ రేట్ల పాలసీ సవరణను ఆమోదించారు. కొత్తగా నేస్తం రుణం కొరకు దరఖాస్తు చేసుకున్న రైతుల దరఖాస్తులను ఆమోదించారు. నెల వారీ లావాదేవీలను ఆమోదించారు. త్రీ మెన్ కమిటీ భాద్యతలు చేపట్టిన 24 రోజులలో 58 లక్షల రికవరీ సాధించినట్లు బాంకు సిఈఓ తెలియ జేశారు. రైతు బాంకుకు రుణం కోసం దరఖాస్తు చేసుకోగానే రుణం త్వరితగతిన రుణం మంజూరు చేయాలన్నారు.

## సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను భీమవరం సీపీఐ జిల్లా కార్యాల యంలో శుక్రవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23న లక్షలాది మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని,

24, 25వ తేదీల్లో జరిగే ప్రతినిధుల సమావేశాల్లో దేశంలోనూ, రాష్ట్రంలోనూ పాలకులు అవలంబి స్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు విప్లవ శంఖం పూరిస్తామన్నారు. మహాసభలు రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తాయన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ఎన్నికల వాగ్దానాలు అమలు చేయడంలో వైఫల్యం చెందాయని వాటిపై చర్చిస్తామని కోనాల వివరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి, సనపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల రైల్వే పాసుల పునరుద్ధరణకు కేంద్రం చర్యలు : ఎంపీ పుట్టా మహేష్

విశాలాంధ్ర - ఏలూరు : కోవిడ్ సమయంలో నిలిపివేసిన జర్నలిస్ట్ పాసుల పునరుద్ధరణకు కేంద్రం చర్యలు తీసుకుం టుందని రైల్వేలు, సమాచార, ప్రసారం, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడిం చారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా జర్నలిస్టులకు రైల్వే పాసుల సౌకర్యం పునరుద్ధరించాలనే అంశంపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. భారతీయ రైల్వేలు సమాజంలోని అన్ని

వర్గాలకు సరసమైన సేవలను అందించ డానికి కృషి చేస్తున్నారు. 2023-24 సంవత్సరంలో ప్రయాణికుల టిక్కెట్లపై రూ. 60,466 కోట్ల రాయితీ అందించామని చెప్పారు. రైల్వేలో ప్రయాణించే ప్రతి ఒక్కరికీ సగటున 45% రాయితీకి సమానం అని, రూ.100 ఖర్చవుతున్న సేవను కేవలం రూ.55కే ప్రయాణికులకు అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర -ఏలూరు : వచ్చే నెల ఐదో తేదీన జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను పొందేందుకు దరఖాస్తులను ఈనెల 26వ తేదీలోగా సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకట లక్ష్మమ్మ తెలిపారు. దరఖాస్తు చేసుకునే టీచర్లు కనీసం 10 సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలని, విద్యా ప్రమాణాల పెంపుదలకు ప్రత్యేక కృషి చేసి ఉండాలని తెలిపారు. గతంలో జిల్లా స్థాయి అవార్డు పొందినవారు, క్రమశిక్షణ చర్యలు ఉన్నవారు దరఖాస్తు చేసేందుకు అనర్హులని డీఈవో తెలిపారు. దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా సమర్పించాలని డీఈవో కోరారు.

## నాటుసారా కలిగి వున్న వ్యక్తి పై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: అక్రమంగా నాటుసారా కలిగి వున్న వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టి .నరసాపురం మండలం బందంచర్ల గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ నేరములు కొరకు దాడులు నిర్వహించి నట్టా కల్యాణ్‌కు చెందిన 50 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి అతని వద్ద నుండి ఒక లీటర్ నాటు సారా స్వాధీన పరచుకొని, అదుపులోకి తీసుకొని , కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# గండం గడిచింది

- భద్రాచలంలో గోదావరి తగ్గుముఖం
- ఊపిరి పీల్చుకున్న విలీన మండలాలు
- ముంపులోనే గుండేటివాగు
- 10 గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- పునరావాస కేంద్రంలోనే గొమ్ముగూడెం

విశాలాంధ్ర - ఏలూరు : వారం రోజులోనే గోదావరి ఉగ్రరూపం దాల్చింది. అనూ హ్యంగా గోదావరి పెరిగింది. ఈ నెల 20న భద్రాచలం వద్ద 40 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో దిగువ నున్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వరద తాకింది. కాగా కుక్కునూరు - దాచవరం గ్రామాల మధ్య ఉన్న గుండేటివాగుకు భారీగా వరద పోటెత్తింది.దీంతో నాలుగు రోజుల నుంచి 10 గ్రామాలకు రాకపోకలు స్తంభించి వరద ఉధృతి కొనసాగుతోంది. వింజరం వద్ద ఉన్న పాలవాగుకు కూడా వరద పెరిగింది. క్రమంగా వరద పలు గ్రామాలను జలదిగ్బంధం చేసింది. మండలంలోని గొమ్ముగూడెం గ్రామస్తు లను స్థానిక అధికారులు మూడు రోజుల క్రితమే దాచవరం పునరావాస కేంద్రానికి తరలించగా అక్కడే ఆశ్రయం పొందు తున్నారు. 21వ తేదీ రాత్రి భద్రాచలంలో మొదటి,రెండవ ప్రమాద హెచ్చరిక దాటి మూడో ప్రమాద హెచ్చరికకు చేరువలో గోదావరి పరవళ్లు తొక్కింది. ఒక అడుగు మేర పెరిగినట్లయితే భద్రాచలంలో మూడో ప్రమాద హెచ్చరికను కూడా అధికార యంత్రాంగం జారీ చేసేవారు. అదేరోజు 11 గంటల నుంచి గోదావరి వరద నిలబడి నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. దీంతో విలీన మండలాలు కుక్కునూరు, వేలేరుపాడు ప్రజలు గోదావరి నుంచి గండం గడిచిందని ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక దాటి 44.80 అడుగుల మేర భద్రాచలంలో గోదావరి వరద ఉధృతి సాగుతోంది.

## ఘనంగా గిడుగు రామమూర్తి జయంతి

విశాలాంధ్ర -భీమవరం: తెలుగు మహాకవుల రచనలు యుగాంతం వరకు చిరస్మరణీయంగా నిలిచి ఉంటాయని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, తెలుగు భాషాభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వీరమ్మ పార్కులోని తెలుగు తల్లి విగ్రహం వద్ద శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, భాషోద్యమ నాయకులు గిడుగు రామమూర్తి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా తెలుగు మహాకవుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తెలుగు శాసనాల లిపిలో తెలుగు భాష కనిపించిందన్నారు. అటు వంటి తెలుగు భాషకు ప్రపంచంలోనే గుర్తింపు ఉందని, ఈ భాషను ప్రాచీన భాషగా గుర్తించాలన్నారు. 36 ఏళ్లుగా తెలుగు బాషా దినోత్సవ వేడుకలను వారోత్సవాలుగా నిర్వహించడం అభినంద నీయమని అన్నారు. తెలుగు పండితులు డాక్టర్ నాగేశ్వరరావు, అధ్యాపకులు జీడిగుంట సునీత మాట్లా డుతూ తెలుగు భాష అనంతమైనదని, జీవనది లాంటిదని, భావ వ్యక్తీకరణకు భాషముఖ్యమని, అటువంటి భాషల్లో తెలుగు భాష మధురమైనదన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు ఈ వారోత్సవాలను నిర్వ హిస్తామని, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహిస్తామని, ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భట్టిప్రోలు శ్రీనివాసరావు, కొండ్రు శ్రీనివాస్, విజ్జురోతి రాఘవులు, దొంగ వెంకటేశ్వరరావు, ఎండి సరోజినీ, లక్ష్మి భవానీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి

### కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: మట్టి వినాయకు లను పూజించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శు క్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, స్పేస్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన 'పర్యావరణ అనుకూల వినాయక చవితి అవగాహన కార్యక్రమం' కు సంబంధించిన గోడపత్రి కలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంద న్నారు. సహజరంగులతో చేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితి జరుపుకుందామన్నారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు మట్టి వినాయకులతో పూజించడం, పత్రిని ఉపయోగించడం ద్వారా కలిగే ప్రయోజ నాలపై ఇప్పటికే జిల్లా అంతట కళా జాతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పేస్ ఎన్జీవో ప్రెసిడెంట్ గోపిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ మావుళ్ళమ్మ గుడి ఆదివారం బజార్‌లో సోమ, మంగళవారాల్లో మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గోడ పత్రిక ఆవిష్కరణలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, ఏఈ ఎస్.రమేష్, ఎన్.వెంకటరమణ, స్పేస్ ఎన్జీవో ప్రెసిడెంట్ గోపిశెట్టి మురళీకృష్ణ తదితరులున్నారు.

## చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆశపు గంగరాజు కృషి

విశాలాంధ్ర - నరసాపురం : పేదలు, చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిన గొప్ప నాయకుడు ఆశపు గంగరాజు అని సీపీఐ రాష్ట్ర నాయకుడు నెక్కంటి సుబ్బా రావు అన్నారు. పట్టణం లోని

మంగినవారి నగర్ లో సీపీఐ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, జర్నలిస్టు ఆశపు గంగరాజు వర్ధంతిని శు క్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ నాయకునిగాను, పట్టణంలో ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారన్నారు. ఉండేల్ పత్రిక సంపాదకుడిగా వార్తలు ప్రజలకు అందించిన ఘనత గంగరాజుకే దక్కుతుం దన్నారు. కార్యక్రమంలో దేవాంగుల సంఘం నాయకులు అల్లంకి నాగేశ్వర రావు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఆరేటి మృత్యుంజయరావు, సానబోయిన ఫణిరాజు, నాగళ్ళ భాస్కర్ రావు, ఎ. కోటేశ్వరరావు, గంగాధర్, న్యాయవాది నెక్కంటి క్రాంతికుమార్, దొంగ పూర్ణ చంద్రరావు, మీసరపు లాల్ తదితరులు పాల్గొన్నారు.

## జన్మభూమిపై మమకారం

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఆయన ఓ మంచి పనులకు ఊతమిచ్చే సౌజన్యశీలి. తన ఊరంటే వల్లమాలిన ప్రేమ. ఊరి సెంటర్‌లో మహనీయుల విగ్రహాలతోపాటు ఐ లవ్ కైకరం బోర్డు సైతం సొంత నిధులతో ఏర్పాటు గావిం చారు. ఇప్పుడు ఆ సెంటర్ ప్రత్యేక ఆకర్ష ణగా నిలుస్తోంది.

ఇంతకీ ఆ సౌజన్య మూర్తి ఉంగుటూరు మండలం కైకరం గ్రామ ముద్దు బిడ్డ కోనా శ్రీనివాస రావు. ఆయన ఏపీ రాష్ట్రఆర్య వైశ్య సంఘం నాయకుడిగా ఉన్నారు. వివిధ సేవా కార్యక్రమాలతో నిత్యం బిజీగా ఉండి గ్రామ అభివృద్ధికి అనేక సేవా కార్యక్ర మాలు చేశారు. ఆర్యవైశ్యులలో పేదలను గుర్తించి వారిఅభ్యు న్నతికి కృషి చేసిన వ్యక్తి కోనా శ్రీనివాసరావు అని చెప్పక తప్పదు. ఆయన కైకరం సెంటర్‌లో వంతెన పక్కన మహాత్మాగాంధీ, అల్లూరి సీతారామ రాజు, అమర జీవి పొట్టి శ్రీరాములు, కీ.శే. మాజీ గవర్నర్ రోశయ్య , అమర సైనికుడు కల్నల్ బిక్కుమళ్ళ సంతోష్ బాబు, గుప్త తదితరుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. వారి జయంతి, వర్ధంతిలను ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ఉంటాడు. ఐ లవ్ యు కైకరం బోర్డు వద్ద ఉన్న మహనీయుల విగ్రహాలను గ్రామాలకు వచ్చే ప్రజలను ఆకర్షిస్తున్నది. ఇతర గ్రామాల నుండి వచ్చేవారు కొద్దిసేపు మహ నీయుల విగ్రహాల వద్ద ఆగి నివాళులర్పించి వెళ్తూ ఉంటారు.

## విద్యార్థులు పోటీతత్వం పెంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: కళాశాలలో చదివే విద్యార్థులు పోటీ తత్వం పెంచుకొని ఎక్కువ మార్కులు సాధించాలని గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి

అన్నారు. శుక్రవారంకళాశాల విద్యార్థులు నాలుగవ సెమిస్టర్ లో ఎస్. చైత్రవాణి,(8 ఓ గ్రేడ్స్(అవుట్ స్టాండింగ్) కోలా కుమారి,నాజవి, సత్య శ్రీ ఇటీవల వెలువడిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను సాధించినట్లు ఆమె తెలిపారు. ఎక్కువమంది విద్యార్థులు ఓఎం ఎ గ్రేడ్లను సాధించారని, ఈ సారి అన్ని కోర్సులలో అధిక ఉత్తీర్ణత శాతం (90%) నమోదైందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ బూట్‌క్యాంపు

**విశాలాంధ్ర -నూజివీడు** :ఆర్జీయూకేటీ నూజివీడులో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో "అఖిల భారత స్థాయి అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ 2025 బూట్‌క్యాంప్" నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ బూట్‌క్యాంప్‌కు భారత ప్రభుత్వ శాస్త్ర - సాంకేతిక శాఖ , ఐబీమ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , యూనిస్కో , క్వాన్ఫుయెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు మద్దతు అందించాయి. వీరి భాగస్వామ్యం ద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్‌లోని అగ్రగామి పరిజ్ఞానం, సమస్యల పరిష్కార పద్ధతులు, మరియు సృజనాత్మకతకు సంబంధించిన వ్యూహాలను విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలిగించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ సీఈఓ చంద్రమౌళి, బిట్స్ పిలాని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇంద్రాక్షిరాయి చౌదరి ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలలో విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయం

**విశాలాంధ్ర - నరసాపురం** :సేవా కార్యక్రమాలలో విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు.

నరసాపురం సూర్య కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి గట్టెం ముక్తేశ్వరరావు వేములదీవి పడమర చినలంక వద్ద ప్రమాదవశాత్తు మరణించాడు. ముక్తేశ్వరరావు తండ్రి కృష్ణా రావు గతంలోనే మృతి చెందారు.ఆ కుటుంబానికి శ్రీ సూర్య కళాశాల విద్యార్థులు అధ్యాపకులు, యాజమాన్యం కలసి రూ.70 వేలు సమకూర్చారు. ఆ నగదును ప్రభుత్వ విప్ నాయకర్ చేతుల మీదుగా ముక్తేశ్వర రావు తల్లి కుమారికి అందజేశారు. విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శ్రీసూర్య విద్యాసంస్థల కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ మాట్లాడుతూ కళాశాల స్థాయి నుండి సేవా కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం తోటి వారికి సహాయ పడాలని ఆలోచనతో ముందుకెళ్ళడం విద్యార్థి దశలోనే అలవర్చుకోవడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, జనసైనికులు, వీర మహిళల తదితరులు పాల్గొన్నారు

## బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

**విశాలాంధ్ర-లింగపాలెం:** బ్యాంకు సేవలను సద్వినియోగించుకొని వాటి ద్వారా ప్రయోజనం పొందాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ పి. కాళిదాసు తెలిపారు.

ధర్మాజీగూడెం ఎస్‌బీఐ బ్రాంచి పరిధిలో వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరికి బ్యాంకు ఎకౌంటు ఉండాలని తెలిపారు. ఈ ఎకౌంటు ఉండటంవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు.

జీరో ఎకౌంట్లు ఓపెన్ చేస్తున్నామని వీటిని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఆగిన ఎకౌంటులను పునరుద్ధరించేందుకు సదుపాయం కల్పిస్తున్నామని ఆధార్ కార్డు బ్యాంకుకు తీసుకొస్తే ఎకౌంటులను తిరిగి పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రమాద,ఆరోగ్య భీమా చేయించుకోవాలని ఇవి కుటుంబాలకు ఆసరాగా ఉంటాయని అన్నారు. సేవా దృక్పథంతో బ్యాంకులు పనిచేస్తున్నాయని వివరించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. సమావేశంలో స్థానిక బ్రాంచి మేనేజర్ పి. రజినీకాంత్, బ్యాంకు, ఆర్బిఓ సిబ్బంది పాల్గొన్నారు.

## 'మానవతా' శాంతి ర్యాలీ

**విశాలాంధ్ర-మండవల్లి** : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గుడివాడ విజయ గణేష్ కుమార్ తెలిపారు. గురువారం మండవల్లి గ్రామంలో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

ఈ సందర్భంగా మండవల్లి నాగేంద్ర స్వామి గుడి వద్ద నుండి స్టేషన్ రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించిన అనంతరం స్థానిక జడ్పీ హెచ్ఎస్ స్కూల్ లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సదాబత్తుల విజయకుమార్, బొల్లంపల్లి కృష్ణ, గుడివాడ చిట్టి బాబు, సమయం ఏసుబాబు, కూనపురెడ్డి కోటేశ్వరరావు, వీరవల్లి శివయ్య, బోయిడి సురేష్, ఎలికే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## శెట్టిబలిజలకు శాపం

(1వ పేజీ తరువాయి)

క్లాసుగా (ఓసి) ప్రకటించడంతో అక్కడివారు విద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ వివాదం ఇప్పటికీ పరిష్కారం అవ్వక తెలంగాణ ప్రభుత్వం, బీసీ కమిషన్, హైకోర్టు పరిధిలో ఉంది. ఏపీలోనూ 2023లో కొత్త జిల్లాల్లో శెట్టిబలిజ కులస్తులు ఓబీసీ సర్టిఫికెట్లు పొందడానికి ఇబ్బంది పడ్డారు. అప్పట్లో కొంత ఆలస్యమైనా అధికారులు సాంకేతిక సమస్య సరి చేయడంతో సమస్య పరిష్కారమైంది. తాజాగా ఆంధ్రాలోనూ నెలరోజులుగా శెట్టిబలిజ సామాజిక వర్గం కులం సర్టిఫికెట్లు పొందడానికి నానా బాధలు పడుతున్నారు. అయినా వారి గోడు పట్టించుకోవడం లేదు. సాంకేతిక లోపం కారణంగా నెల రోజులుగా గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల నుండి శెట్టి బలిజ కులం సర్టిఫికెట్ రావడం లేదు. అధికారిక ఏపీ సేవ పోర్టల్‌లో శెట్టిబలిజ కులాన్ని తొలగించారు. కేవలం గౌడ (శెట్టిబలిజ) కులం మాత్రమే వస్తుండడంతో ఆ సామాజిక వర్గ వారు ఆందోళన చెందుతున్నారు. 138 బీసీ కులాల జాబితాలో శెట్టిబలిజ కులం ఆన్లైన్ జాబితాలో కనిపించకపోవడంతో వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్య కారణమైనా కులం సమస్య పరిష్కారానికి జాప్యం జరుగుతుండడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. అసలే ప్రస్తుతం జాబుల జాతర జరుగుతోంది. దీనికి తోడు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలకు విధిగా కులం సర్టిఫికెట్ కావలసి ఉంది. చాలా ఉద్యోగాలకు చివరి గడువు కూడా ముగిసిపోయి శెట్టిబలిజ సర్టిఫికెట్లు రాక విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. పోనీ బీసీ వర్గమైన గౌడ (శెట్టిబలిజ) కులం సర్టిఫికెట్ను తాత్కాలికంగా తీసుకున్నా భవిష్యత్తులో ఈ సామాజిక వర్గానికి చెందిన వారికి సమస్యలు ఏర్పడతాయి. ప్రస్తుతం ఉన్న కులం సర్టిఫికెట్ స్థానే తర్వాత కొత్తగా శెట్టిబలిజ కులం సర్టిఫికెట్ పొందాలంటే సాధ్యం కాని పని. నెలల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగాల్సిందే. ప్రస్తుతం గ్రామ వార్డు సచివాలయాలు, మీసేవ కేంద్రాలకు శెట్టిబలిజ కులం సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే దరఖాస్తుదారులకు అక్కడి సిబ్బంది ఏమి చెప్పాలో పాలు పోని అయోమయస్థితి నెలకొంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, కృష్ణ, పశ్చిమగోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో శెట్టిబలిజ కులస్తులు అధికంగా ఉంటారు. రాష్ట్రవ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల్లోనూ శెట్టి బలిజ కులం సర్టిఫికెట్లు దరఖాస్తులు ఆన్లైన్లో పేరుకుపోయాయి. గౌడ శెట్టిబలిజ అని కులం సర్టిఫికెట్ మంజూరు చేస్తే సమస్యలు ఎదురవుతాయని రెవెన్యూ అధికారులు దరఖాస్తులను హోల్డ్‌లో పెట్టారు. స్వయానా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి ఈ సమస్య వెళ్ళింది. ఈ సాంకేతిక సమస్యను తాను రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిలకు తెలిపానని త్వరలోనే పరిష్కరిస్తానని శెట్టి బలిజ కులస్తులు ఆందోళన చెందవద్దని ప్రకటించారు కూడా. రోజులు గడుస్తున్నా అధికారులు చిన్న సాంకేతిక సమస్యను సకాలంలో సరిచేయకుండా శెట్టిబలిజ కులం సర్టిఫికెట్లు జారీ చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు వెంటనే సాంకేతిక సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యపై కాట్రేనికోన మండల తహసీల్దార్ సుబ్బలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లగా సాంకేతిక సమస్య కారణంగా శెట్టిబలిజ కులం సర్టిఫికెట్లు రావడం లేదని, ఆ వర్గాలవారు గౌడ (శెట్టిబలిజ) సర్టిఫికెట్లు తీసుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవు తాయని అన్నారు. ప్రస్తుతానికి శెట్టిబలిజ వర్గీయులకు కులం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తహసీల్దార్ తెలిపారు. ఈ సాంకేతిక సమస్య ఉన్నతాధికారుల పరిశీలనలో ఉందన్నారు.


**ప్రకటన**

**మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), నర్సాపురం వారి కోర్టులో**

**Debtor I.P.No.20/2025**

**పిటిషనర్: జరుగు సుబ్రహ్మణ్యం, తండ్రి సత్యనారాయణ,** వయస్సు 46 సం.లు.. అచ్చుకట్లపాలెం, పాలకొల్లు మండలం, ప.గో. జిల్లా

V/s.

రెస్పాండెంట్లు : **1. కటూరి ఉషారాణి, W/o. వెంకటేశ్వర్లు,** పూలపల్లి, పాలకొల్లు మండలం, ప.గో. జిల్లా.
**2. గుడిసె రమాదేవి, W/o. సత్యనారాయణ @ బుజ్జి,** హౌసింగ్ బోర్డు కాలనీ, పాలకొల్లు, ప.గో.జిల్లా
**3. బోనం శ్రీరంగ నాయకులు, S/o. మాణిక్యాలరావు,** గిగ్గిపఱ్రు, పాలకొల్లు మండలం, ప.గో. జిల్లా.
**4. రేఖపల్లి సూర్యనారాయణ, S/o. రాము,** రామాలయం వీధి, అగర్తిపాలెం, పాలకొల్లు, ప.గో. జిల్లా.
**5. కొప్పర్తి మురళి, S/o. సూర్యనారాయణ,** హౌసింగ్ బోర్డు కాలని, పాలకొల్లు., ప.గో. జిల్లా
**6. నిమ్మకాయల కుమారి, C/o. నిమ్మకాయల కుమారి,** హౌసింగ్ బోర్డు కాలని, పాలకొల్లు., ప.గో.జిల్లా
**7. తలరి వీరాంజనేయులు, S/o. వాట్‌సోన్, డాక్టర్,** చిత్రయిచేరువు గట్టు, అచ్చుగాట్లపాలెం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా

పై నెంబరు గ్రంథంలో పిటిషనరు రెస్పాండెంట్‌లకు ప్రోనోటు బకాయి ఉన్నందున ఆ ప్రోనోటు బకాయి పిటిషనరు తీర్చలేని స్థితిలో ఉన్నందున, పిటిషనరును ఇన్‌సాల్వెంట్‌గా ప్రకటించమని కోర్టులో పిటిషనర్ పిటిషను దాఖలు చేసినందున యీ విషయాన్ని ఈ ప్రకటన ద్వారా తెలియచేస్తున్నాము.

**వాయిదా: 8-09-2025**

**K. Naga Durgavathi, Rongala Chandu.**
Advocates. Palakol. Cell No. 9963122266
ప్రదేశం: నర్సాపురం


## స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

**విశాలాంధ్ర - నరసాపురం** : ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు మైక్రో ఫిల్టర్ నిర్మాణం దోహదపడుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు.

మొగల్తూరు మండలం శేరేపాలెంలో రూ.20 లక్షల నిధులతో చేపడుతున్న మైక్రో ఫిల్టర్ పనులను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరికీ ఆరోగ్యకరమైన త్రాగునీరు అందించడమే ముఖ్య లక్ష్యమన్నారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి చర్యను గ్రామస్థాయిలో అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నిప్పులేటి తారక రామా రావు, మైల వసంతరావు, వాతాడి కనకరాజు, దూసరపూడి సత్య నారాయణ, అందే దొరబాబు, వెన్న నరేష్, లక్కు బాబి, మైల రాంబాబు, కొండేటి తాతాజీ, మైల ముత్యాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎలుకల మందు సేవించి మృతి

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం** : ఎలుకల మందు సేవించి వ్యక్తి మృతి చెందిన సంఘటన కొయ్యలగూడెం పట్టణంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పనసకాయల నాగేశ్వరరావుకు అతని భార్యకు మధ్య డబ్బుల విషయంలో వివాదం జరగగా అతని భార్య ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుండి నాగేశ్వరరావు మానసికంగా బాధపడుతూ గురువారం ఎలుకల మందు సేవించగా అతనిని కొయ్యలగూడెంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## మానవతా ఆధ్వర్యంలో శాంతిర్యాలీ, మానవహారం

**విశాలాంధ్ర-భీమడోలు:** మానవతా స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలో సంస్థ సభ్యులు విద్యార్థులతో కలిసి శాంతిర్యాలీ నిర్వహించారు. శుక్రవారం స్థానిక శ్రీవిద్యాలయ పాఠశాల నుంచి

పాఠశాల విద్యార్థులు, మానవతా సంస్థ సభ్యులు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక సంతమార్కెట్ సెంటర్, గాంధీబొమ్మ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రపంచశాంతి వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు 'ప్లాస్టిక్ ను బహిష్కరించాలని, మొక్కలు నాటాలని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవతా సంస్థ లక్ష్యం అని, గ్రామాల్లో ఉచితంగా ఫ్రీజర్‌లు, శాంతిరథాలు ఏర్పాటు చేయడం, విద్యార్థుల భవిష్యత్తుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుండుగొలను సొసైటీ అధ్యక్షులు కొండ బాబు, మానవతా సంస్థ కేంద్రనియంత్రణ కమిటీ కన్వీనర్ రామిశెట్టి గంగాధరరావు, సంస్థ మండల అధ్యక్షులు అల్లాడ ప్రసాదరావు, కార్యదర్శి చిలపర్తి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు అభినందనీయం

**విశాలాంధ్ర - నరసాపురం:** మెగా స్టార్ చిరంజీవి అభిమానులు చేస్తున్న సేవాకార్య క్రమాలు అభినంద నీయమని మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొండేటి శ్రీనివాసరావు అన్నారు. మండలం లోని వేములదీవి పడమర



కాపుల కొడప లో చిరు పవన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిరంజీవి పుట్టిన రోజు వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని కేకు కట్ చేసి మాట్లాడారు. మెగాస్టార్ పిలుపుతో అభిమానులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అనంతరం ఉంగరాల యుధిస్టర్, యూత్ చేపట్టిన పలు సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కోపల్లి శ్రీనివాస్, అంజనా సత్తిబాబు, గుగ్గిలపు శివ రామకృష్ణ, పోలిశెట్టి సాంబ, దేవిరెడ్డి రామచంద్రరావు, ఉలిశెట్టి ములాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక అభివృద్ధిలో యువత సహకారం

**విశాలాంధ్ర - గోపాలపురం :** ప్రజాహిత కార్యక్రమాలలో చిరంజీవి అభిమానులు పాల్గొని సేవలందించాలని జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగండ్ల సుగుణ రజు పిలుపునిచ్చారు. పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలను గోపాల పురం జనసేన పార్టీ కార్యాలయం లో గోపాలపురం మండల చిరంజీవి యువత అధ్యక్షులు సూర్య భగవాన్ ఆధ్వర్యంలో భారీ కేక్‌కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిధిగా పార్టీ నియోజకవర్గం ఇంచార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగ సువర్ణ రాజు మాట్లాడుతూ చిరంజీవి ఔన్నత్యాన్ని గొప్ప మనసుని కొనియాడుతూ రక్త దానం నేత్ర దానం వంటి గొప్ప కార్యక్రమల ద్వారా అయన చేస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు సిబ్బందికి పండ్లు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజేంద్ర, ఉపాధ్యక్షులు పోసిన గణపతి, మద్దాల కాశీ విశ్వనాథ సనారి, రాంబాబు, ఫణింద్ర, ఉమా, ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.


**ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది**

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం శ్రీరామ్ పేటకి చెందిన **మొల్ల బిల్ కిస్ ఖాతూన్, భర్త మొల్లగులే హుస్సేన్** అను నేను ఈ నెల **15 వ తేదీన** అంబేద్కర్ కోనసీమ జిల్లా, నగరం గ్రామంలో ఉన్న మా అమ్మమ్మ గారి ఇంటికి వచ్చి మామిడికుదురు సెంటర్‌కు పాస్‌పోర్టు జిరాక్స్ తీయించుకునేందుకు మోటర్ సైకిల్‌పై వెళ్లుచుండగా మార్గమధ్యంలో **R 5904552** నంబర్ గల ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. ఎవరికైనా దొరికినచో దయచేసి ఈ కింది అడ్రస్‌కు అందించవలెను.

**మొల్ల బిల్ కిస్ ఖాతూన్, భర్త: గులే హుస్సేన్**
డోర్ నంబర్ : 12-4-30/ఎ
శ్రీరామ్ పేట, పాలకొల్లు మండలం
పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.



**DEBTS RECOVERY TRIBUNAL : VISAKHAPATNAM**

**Ground & 1st Floor, 31-31-21, Sai Baba street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam-530020**

**Case No. OA.345/2025**

Summons under subsection (4) of section 19 of the Act, read with sub-rule (2A) of the Debt Recovery Tribunals (procedure) Rule, 1993.

**State Bank of India (RACPC), Amalapuram**
Rep.by Its Manager & authorised signatory ... **Applicant**

VS

**Sri Krishna Prasad Gurrala,** S/o. Lohidas

To, **Sri Krishna Prasad Gurrala,** S/o. Lohidas, D.No.3-111/1, Penumalla Village, Katrenikona Mandal, Dr.B.R.Ambedkar, Konasema District-533262
Also at: D.No. 8-1-284/04/2, OU Colony, Shaikpet, Manikonda Village, Hyderabad, Telangana ... **Defendant**

**SUMMONS TO DEFENDANTS BY PAPER PUBLICATION**

WHEREAS, OA/345/2025 was listed before Hon'ble Presiding Officer/Registrar on 27-08-2025

WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.47,06,914.97ps (application along with copies of documents etc. annexed).

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-

i. To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;

ii. To disclosed particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;

You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;

iii. You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;

iv. You shall be lia for the sale prosecured assets You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank financial institution holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before **Presiding Officer/Registrar 27-08-2025. 10:30 a.m.** failing the application shall be heard and declared in your absence. Given under my hand and the seal of this Tribunal on this 06th day of August, 2025.

Signature of the Office Authorized to issue Summons
Registrar, Debts Recovery Tribunal
VISAKHAPATNAM


# విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : ఎస్పీ

**విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ :** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పోలీసుల అనుమతి లేకుండా విగ్రహాలు, పందిళ్లు, మండపాలు ఏర్పాట్లు చేయకూడదని జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ స్పష్టం చేశారు. గణేష్ మండపాలు, పందిళ్ళు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు తప్పనిసరిగా పొందాలని తెలియచేస్తూ, మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానాలు చెల్లించనవసరం లేదన్నారు. మండపాల వద్ద డీజేలు, అధిక శబ్దం చేసే సౌండ్ సిస్టం లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదని, విగ్రహాల వద్ద తాత్కాలిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండపాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా ఈనెల 23 రాత్రి 8గంటల లోపల ఆన్ లైన్ దరఖాస్తు చేసుకోవాలని, వినాయక చవితి నుంచి 11 రోజుల లోపే నిమజ్జనాలు పూర్తి చేయాలని, 11 రోజుల తరువాత నిమజ్జనాలు అనుమతించబడవన్నారు. డిజే సౌండ్ బాక్స్‌లకు అనుమతిలేదని, సాధారణ సౌండ్ బాక్స్‌లు మాత్రమే అను మతిస్తామని, మైక్ పర్మిషన్ కోసం సంబంధిత డిఎస్‌పి గారి నుండి అనుమతి తీసుకోవాలన్నారు. పబ్లిక్ ప్రదేశాలలో మండపం ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని, ప్రైవేట్ ప్రదేశాలలో గణేష్ మండపాలను ఏర్పాటు చేసేవారు స్థలం యజమాని నుండి 'నో అబ్జెక్షన్' సర్టిఫికేట్ అనుమతి పొందాలన్నారు. విగ్రహాల ఎత్తు 5 అడుగులు మించరాదని, రాత్రి 10.00 గంటల తరువాత ఎలాంటి కార్యక్రమాలు జరపరాదని, అశ్లీల నృత్యాలు అనుమతించబడవని ఆయన స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఎటువంటి అల్లర్లు, ఘర్షణల కు తావులేకుండా సంతోషంగా జరుపుకోవాలని, ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మానవతా స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినోత్సవం

**విశాలాంధ్ర-దేవరపల్లి:** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరపల్లి మండల మానవతా శాఖ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మండల చైర్మన్ బల్ల సూర్య చక్రం ప్రారంభించారు. అధ్యక్షులు బండి సూర్య ప్రకాశరావురావు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోరుతూ ప్రజలందరూ శాంతి సామరస్యంతో సుఖంగా జీవించాలని ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం చేయడానికి 2004లో మానవతా సంస్థ జంగారెడ్డిగూడెంలో రామచంద్రారెడ్డి సారధ్యంలో ప్రారంభించబడింది. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 80 వేల మంది సభ్యులతో ప్రజాసేవలో ముందుందన్నారు. చైర్మన్ బల్ల సూర్యచక్రం మాట్లాడుతూ మానవతా సంస్థ ఫ్రీజర్ బాక్సులు శాంతి రథాలను ప్రజలకు అందుబాటులో ఉంచిందన్నారు. జిల్లా కన్వీనర్ కేశిరాజు వెంకట రాజకుమార్ మాట్లాడుతూ మెరిట్ ఉన్న పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందిస్తున్నదన్నారు ప్రమాదాలు జరిగిన వారికి తక్షణ సహాయం సంస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. దేవరపల్లి మండల మాజీ అధ్యక్షుడు బలుసుసత్యనారాయణ తాళ్లపూడి మండల మాజీ అధ్యక్షుడు సాయన సుబ్బారావు దేవరపల్లి మండల శాఖ కార్యదర్శి కూసం పూడి నరేష్ వర్మ ఈసీ మెంబర్ ఆకుల నాగేశ్వరరావు బిహెచ్ఎస్ఆర్ కాలేజీ లెక్చరర్స్, విద్యార్థినీ విద్యార్థులు దేవరపల్లి మండలం వివిధ గ్రామాల మానవతామూర్తులు తదితరులు పాల్గొన్నారు. మన మండల శాఖకు శాంతి రథాన్ని కొనిచ్చిన కరటూరి ధనంజయుడుకి ఫిక్స్ డిపాజిట్ వేయుటకు సహకరించిన దాతలు అందరికీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరపల్లి మండల మానవతా శాఖ కృతజ్ఞతాభివందనములు తెలిపారు.

## వ్యాపార సాధనే లక్ష్యం : చైర్మన్

**విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ :** 1926వ సంవత్సరం ఆగస్టు 22న రాజమహేంద్రవరం లోని జాంపేటలో స్థానిక దేవాంగ ప్రముఖులతో పాటు వస్త్ర వ్యాపారి కీ.శే. శీలా వీరభద్రుడు ఆధ్వర్యంలో ఒక చిన్న సహకార సంస్థగా తన ప్రస్థానం ప్రారంభించిన ది జాంపేట కో - ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నేడు 99 వసంతాలు పూర్తి చేసుకుని శత వసంతంలోకి అడుగుపెట్టిందని బ్యాంకు చైర్మన్ బొమ్మన జయ కుమార్ అన్నారు. తమ బ్యాంకు శత వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా స్థానిక జాంపేటలోని బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చేనేత కార్మికులు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆలంబనగా ప్రారంభించిన తమ బ్యాంకు నేడు అనేక శాఖలను ఏర్పాటు చేసుకుని అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఈ క్రమంలో 2009 నుండి 2018 వరకు 8 కొత్త బ్రాం చీలను ప్రారంభించామని, అన్ని బ్రాంచీలను సిబిఎస్ తో అనుసంధానించి 'ఏనీ బ్రాంచ్ బ్యాంకింగ్, ఆర్టిజిఎస్/ నెఫ్ట్, ఐఎంపిఎస్, మొబైల్ బ్యాంకింగ్ సేవలు ప్రారంభించామన్నారు. అనంతరం తన సారధ్యంలో మరో నాలుగు బ్రాంచీలు ప్రారంభించి మొత్తం 13 బ్రాంచీలతో వ్యాపారాన్ని రూ. 793 కోట్ల స్థాయికి చేర్చడం జరిగిందన్నారు. ఆధునిక సేవలను అందుబాటు లోకి తెచ్చి ఖాతాదారులకు నమ్మకమైన సేవలందించా మన్నారు. ఏటా లాభాలను ఆర్జిస్తూ, బ్యాంకులోని 35,000 మంది సభ్యుల కు క్రమం తప్పకుండా డివిడెండు చెల్లింపులు చేయడమే కాకుండా బ్యాంకు సభ్యులందరికీ రూ.లక్ష రూపాయల ప్రమాద బీమా సదుపాయం అందిస్తున్నామన్నారు. అలాగే శత వసంతాల వేడుకల ప్రారంభం సందర్భంగా డిపాజిట్ దారులకు ప్రతి లక్ష రూపాయల డిపాజిట్ కు రూ.10,000 చొప్పున షేరు ధనం మంజూరు చేయడానికి పాలకవర్గం తీర్మానించిందని, మంజూరు చేసే షేరు ధనం ఒక్కొక్కరికీ రూ. 1,50,000 మించ కూడదని నిర్ణయించామన్నారు. ఆగస్టు 2026 నాటికి 900 కోట్ల రూపాయల వ్యాపారం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలోవైస్ చైర్మన్ రొబ్బి విజయ్ శేఖర్, జామిశెట్టి గాంధీ, ప్రసాదుల హరనాథ్, మహంతి లక్ష్మణరావు, శ్రీమతి ద్వార పార్వతి సుందరి, బూర రామ చంద్రరావు, బీర శ్రీనివాసరావు, జి.ఎస్. ప్రసాదరావు, కె.నాగేశ్వ రరావు, వై. రామకృష్ణ, జామి కృష్ణ, పి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లిలో వరలక్ష్మి వ్రతాలు

**విశాలాంధ్ర - ఆత్రేయపురం :** కలియుగ వైకుంఠం, కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణమాసపు చివరి శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య వరలక్ష్మి వ్రతాలు ఘనంగా జరిగాయి. అర్చక స్వాములు స్వామివారికి నీరాజనం, మంత్రపుష్పం తదితర శాస్త్రోక్త పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణ అధికారి నల్లం సూర్య చక్రధర్ రావు, అర్చక స్వాములు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**విశాలాంధ్ర -దేవరపల్లి:** దేవరపల్లిలో గల షిరిడి సాయి మందిరం అన్న సమారాధన భవనమునందు దేవరపల్లి శ్రీ సత్యసాయి సేవా సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ శిరిడి సాయినాథ్ సేవా సమాజ్ సభ్యుల సహకారంతో శుక్రవారం వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వైద్యుల సహకారంతో ఉచిత కంటి వైద్య సేవా శిబిరం నిర్వహించారు. ఈ సేవను 90 మంది వినియోగించుకున్నారు.

## ఘనంగా చిరంజీవి పుట్టినరోజు

**విశాలాంధ్ర-దేవరపల్లి:** మెగాస్టార్, పద్మ విభూషణ్ కొణిదల చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా దేవరపల్లి గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు, కేక్ కట్ చేశారు. బస్టాండ్ సెంటర్‌లో ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జీ సువర్ణరాజు , గ్రామ జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు పసుపులేటి ప్రసాద్, గ్రామ అధ్యక్షులు కంబాల సత్తిబాబ, ప్రధాన కార్య దర్శులు జాజిమొగ్గల శ్రీనివాస్ సూరిశెట్టి బాలు, ఉపకార్యదర్శి మణికంఠ, ట్రెజరీ ఆకుల వీర్రాజు, యూత్ ప్రెసిడెంట్ తాతబ్బాయి ప్రోగ్రామ్ ఇంచార్జీ గంటా సురేష్, అంజిగ సొసైటీ డైరెక్టర్ కవల సీత రత్న సూర్య కుమారి, నాయకులు కొండపల్లి రమేష్ మాదవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం దారిపెల్లి గ్రామంలో ఉన్న జై కిసాన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు స్వీట్లు పండ్లు భోజనాలు ఏర్పాటు చేసి పూల మొక్కలు నాటారు.

## మానవతా సంస్థ సేవలు అభినందనీయం

**విశాలాంధ్ర - గోపాలపురం :** ఆపదలో ఉన్న వారికి మానవతా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్సై కి మనోహర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిట్యాల గ్రామంలో మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి ఈ సందర్భంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక గోపాలపురంలో ఎస్సై మనోహర్ మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీనిర్వహించి చెక్పోస్ట్ సెంటర్‌లోని నాలుగు రోడ్ల కూడలిలో మానవతా సంస్థ సభ్యులు గ్రామ పెద్దలు విద్యార్థులతో మానవహారం నిర్వహించి, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, యుద్ధాలు వద్దు శాంతి ముద్దు, మానవసేవే మాధవ సేవని నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలపురం ఎస్సై మనోహర్ మాట్లాడుతూ బాల్య వయసు నుండి మానవత్వపు విలువలు తెలుసుకోవాలని, మానవ సంబంధాలు పెంపొం దించుకోవాలని తోటి మనుషులకి సహాయపడే గుణం బాల్యం నుంచే అలవాటు చేసుకోవాలని అన్నారు. నేను మానవతా లో చేరి, నా జీవితం సార్ధకత చేసుకున్నానని, నా వంతు సేవా కార్యక్రమాల లో చేయూతనివ్వటం నాకు తృప్తిగా ఉందన్నారు. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమన్నారు. అనంతరం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మొక్కలునా టారు. మానవతా సంస్థ మండల అధ్యక్షులు జొన్నలగడ్డ రాంబాబు, గెడ జోగేంద్ర ప్రసాద్, పలువురు మానవ సభ్యులు పాల్గొన్నారు.

## యువకుడి హత్య

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : తన భార్యపై అనుచిత వ్యాఖ్యలు చేసి క్షమాపణలు చెప్పలేదన్న కక్షతో ఓ యువకుడిని తన స్నేహితులతో కలిసి హత్య చేసిన సంఘటన రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వేపాడి సతీష్ కుమార్ అనే యువకుడు రైళ్ళలో సమోసాలు అమ్ముతుంటాడు. అతనికి మద్యం అలవాటుంది. వీలు కుదిరినపుడల్లా తన స్నేహితులతో కలసి కైలాస భూమి శ్మశాన వాటికలో స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తూ ఉంటాడు. ఇదే క్రమంలో అతడు భాగ్ రాధాకాంత్, నమ్మి సూర్య తేజ, భాగ్ గౌతం, దొంగ సాధి రాజు, మోటూరి రవిలతో కలిసి స్థానిక ఇస్కాన్ మందిరం సమీపంలోని కైలాసభూమిలో మద్యం సేవించాడు. అయితే అంతకు ముందు రోజు సతీష్, భాగ్ రాధాకాంత్ భార్య శీలంపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని, దానికి క్షమాపణ చెప్పమంటే చెప్పకుండా తిరిగి అనుచిత వ్యాఖ్యలకు దిగడంతో భాగ్ రాధాకాంత్ మద్యం సేవించినపై నలుగురితో కలిసి సతీష్‌ను తీవ్రంగా కొట్టి, ఒక కర్రతో అతడిని హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వారు సతీష్ మృత దేహాన్ని స్మశాన వాటికకు దక్షిణ భాగంలో గోడ పక్కన పడేసి ఏమీ ఎరుగనట్లు అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఇంటి నుంచి వెళ్ళిన తన సోదరుడు ఎంతకీ రాకపోయేసరికి అనుమానం వచ్చిన మృతుని సోదరుడు వేపాడి నాగ సుబ్రహ్మణ్యం కైలాస భూమి పరిసర ప్రాంతాల్లో వెదకగా, మృత దేహం పొదైపోయిన స్థితిలో కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఎస్.ఐ.టి. శ్యామ్ సుందర్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే తమ కోసం పోలీసులు వెదుకుతున్నారన్న విషయం తెలుసుకున్న ముద్దాయిలు ఈనెల 20న 47వార్డు వీఆర్వో కాంగ్రెగుల రమాజ్యోతి దగ్గర లొంగి పోయారు. దీంతో సీఐ. పి. శివగణేష్ రంగంలోకి దిగి, ముద్దాయిలు హత్యకు ఉపయోగించిన కర్రను, హతుడి తాలూకు తెల్ల టీషర్టును స్వాధీనం చేసుకుని, ముద్దాయిలను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

## సర్వేలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - సీతానగరం: నిర్ణీత గడువులోగా ప్రభుత్వ సర్వేలను పూర్తి చేయాలని జిల్లా అధికారిని డి ఎల్ డి ఓ వీణ దేవి తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎమ్ భారతి ఆధ్వర్యంలో డి ఎల్ డి ఓ వీణ దేవి సర్వేల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఎల్ డి ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వామిత్వా కుషాల్, ఈ ఏకే వై సి మొదలగు సర్వేలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వేలను పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ సర్వేయర్లు స్వామిత్వా సర్వేలో పాల్గొని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా మండలానికి వచ్చిన సర్వేయర్లు గ్రామ చిత్ర పాటలను రెవెన్యూ కార్యాలయం నుంచి తీసుకొని ఎప్పటికప్పుడు సర్వే పురోగతిని మండల అధికారులకు తెలపాలని అని అన్నారు. మండల వైద్య అధికారి డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ప్రతీ నెల మూడవ శనివారం నిర్వహించనున్న స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నేడు " పరిశుభ్రత "పరిశుభ్రతతో పాటు వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాలు నీటి నిల్వలను తొలగించడం, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, మండల సర్వేయర్ గౌతమ్, ఏ ఓ సుబ్రమణ్యం, అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, వి ఆర్ ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండాలి : మాధవి

విశాలాంధ్ర - అమలాపురం : వరద ప్రభావం తగ్గే వరకూ అప్రమత్తంగా ఉండాలని డిఆర్ఓ కొత్త మాధవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక అల్లవరం మండల పరిధిలోని పల్లిపాలెం బోడసకుర్రు గ్రామాలలోని వరద ముంపు ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి వరద ఎక్కువైతే సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధం కావాలన్నారు. వరద తాజా పరిస్థితిపై స్థానిక అధికారులతో సమీక్షించారు. గోదావరి వరద ప్రభావం తగ్గే వరకు అధికారులు అంతా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. వరద తాజా పరిస్థితిపై రెవిన్యూ విద్యుత్తు, వైద్య ఆరోగ్య శాఖ, ఫిషరీస్, ఐసిడియస్, తదితర శాఖల అధికారులతో చర్చించారు. 8, 9 నెలల గర్భిణులు సమీప పిహెచ్‌సిహెచ్‌సీకు తరలించాలని, ఒక్క గర్భిణీ ఇంటి వద్ద ఉండకుండా మరొక సారి పరిశీలన చేసుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు భరోసాను ఇచ్చారు. విద్యుత్తు సరఫరా నిత్యవ సరాలు సహాయక భద్రత చర్యల కొరకు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలలోని లోతట్టు గ్రామ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో సీజనల్ వ్యాధుల నియంత్రణ ఫీవర్ సర్వే ముమ్మరంగా సాగుతుందన్నారు. నదిలో ప్రయాణించడం, వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం, స్నానాలకు వెళ్లడం లాంటివి చేయ రాదన్నారు.ఇప్పటికే మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆయా నివాస ప్రాంతాల రేషన్ దుకాణాలలో సిద్ధంగా ఉంచామన్నారు. పల్లిపాలెంలో రేషన్ డిపోను సందర్శించి నిల్వలను పరిశీలించారు. వరద హెచ్చరికలకు అనుగుణంగా వరద పరిస్థితిపై స్థానిక బృందాలు సహాయక చర్యలు చేపడతాయన్నారు. తహసీల్దార్ నరసింహారావు, అదనపు డిఎం అండ్ హెచ్ఓ సిహెచ్ వి భరత లక్ష్మి, వైద్యులు డాక్టర్ స్పందన స్థానిక అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తాళ్లూరు లిఫ్ట్ ఆధునికీకరణకు నిధులు మంజూరు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం తాళ్లూరులో గల పుష్కర అంతర్భాగం తాళ్లూరు లిఫ్ట్ మరమ్మతులకు ప్రభుత్వం రూ.52 కోట్ల రూపాయలు విడుదల చేసిన సందర్భంగా తాళ్లూరు లిఫ్ట్ వద్ద పుష్కర ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, ఆధ్వర్యంలో రైతులతో కలిసి పాలాభిషేకం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను రైతులందరూ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా పుష్కర అంతర్భాగమైన తాళ్లూరు లిఫ్ట్ సిమెంట్ పైపులు పూర్తిగా పాడై 31 వేల ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో గత ఎన్నికల్లో చంద్రబాబు జగ్గంపేట ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు తాళ్లూరు లిఫ్ట్ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు హామీ ఇవ్వాలని కోరడం ఆయన వెంటనే స్పందించి హామీ ఇచ్చిన సందర్భంలో ప్రభుత్వం ఏర్పడిన దగ్గరనుంచి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అనేకసార్లు రాజధాని వెళ్లి ముఖ్యమంత్రిని ఇరిగేషన్ మంత్రిని అనేకసార్లు కలిసి నిధులు కోరడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి రూ.52 కోట్లు శాంక్షన్ చేసి క్యాబినెట్ ఆమోదం పొందడం జరిగిందని అన్నారు. అనంతరం డిఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ తాళ్లూరు లిఫ్ట్‌లో పూర్తిగా పాడైన సిమెంటు పైపులు స్థానం ఐరన్ పైపులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం 52 కోట్లు సాంక్షన్ చేసి క్యాబినెట్ ఆమోదం చేసిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, అడప భరత్, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, బుర్రి సత్తిబాబు, సుంకవిల్లి రాజు, బొల్లం రెడ్డి రామకృష్ణ, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు, అవసరాల బాలసుబ్రమణ్యం, బద్దిరెడ్డి అచ్చన్న దొర, దాపర్తి సీతారామయ్య, కురుకూరివీర వెంకట చౌదరి, యర్రం శెట్టి బాబ్జి, శిలామంతుల వీరబాబు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఆటో వాహనదారులకు బియ్యం పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : ఆటో వాహనదారులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా తాత్కాలిక సహాయం జగ్గంపేట ఎమ్మెల్యే టిటిడి సభ్యులు జ్యోతుల నెహ్రూ అందజేశారు. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే నెహ్రూ నియోజకవర్గంలోని 1700కు పైగా ఆటో వాహనదారులకు బియ్యం పంపిణీ కార్యక్రమం శుక్రవారం జగ్గంపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు హాజరై వాహనదారుల సహాయక కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నెహ్రూ మాట్లాడుతూ శ్రీ శక్తి పథకం ద్వారా మహిళలు లబ్ధి పొందుతున్నారని సత్ఫలితంగా నియోజకవర్గంలోని ఆటో వాహనదారులు నష్టం జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. సంబంధిత వాహనదారులకు ప్రస్తుత తాత్కాలిక సహాయం మేరకు పాతిక కేజీల బియ్యం ప్యాకెట్లను నియోజకవర్గంలోని 1700కు పైగా యాజమాన్యకు స్వయంగా ఆటో వద్దకు వెళ్లి అందజేశారు. భవిష్యత్తులో వారికి ప్రతి విషయంలోనూ అండగా ఉంటానని అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యను వివరించి తగిన ప్రతిఫలం పొందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడప భరత్, ఎస్వీ అప్పలరాజు, ఆర్యవైశ్య కన్వీనర్ కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, వీరారెడ్డి కాశి బాబు, తోట గాంధీ, భూపాలపట్నం ప్రసాద్, తెలప సీనియర్ నాయకుడు రేఖ బులి రాజు, రాజపూర్ సొసైటీ చైర్మన్ ఉప్పలపాడు బుల్లపు చౌదరి ఆటో పంపిణీ ల్గొన్నారు.

## రైతుల ఆందోళన

విశాలాంధ్ర- తాళ్లపూడి : తాళ్లపూడి మండలం మలకపల్లి సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు ఆందోళన చేశారు. సొసైటీ వద్దకు యూరియా లారీ వచ్చిందని తెలిసిన వెంటనే రైతులు అధిక సంఖ్యలో చేరారు. శుక్రవారం మండలంలోని మలకపల్లి, పెద్దేవం, తిరుగుడుమెట్ట తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు యూరియా కోసం చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మండలం లోని సొసైటీలలో యూరియా సరఫరా చెయ్యకుండా, తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేసారు. రైతుకు ఒక బస్తా ఇస్తున్నారని 5 నుంచి 10 ఎకరాలు సాగు చేసే రైతులు కు ఒక బస్తా ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. తిరుగుడు మెట్టకు చెందిన రైతులు అయితే యూరియా కోసం తీవ్రం ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. తాము అన్నదేవరపేట సొసైటీ పరిధిలో ఉన్నామని అక్కడకు యూరియా ఎప్పుడు వస్తుందో తెలియడం లేదని అంటున్నారు. మలకపల్లి సొసైటీకి వస్తే తమకు యూరియా ఇవ్వడం లేదని అంటున్నారు. ఎకరానికి కనీసం మూడు బస్తాలు అయినా కావాలని అంటున్నారు. మొదటి దఫా మాత్రమే వేసామని రెండవ దఫా యూరియా 10 రోజులుగా వేయలేదని రైతులు చెబుతున్నారు. అవసరం లేక పోయినా కొందరు మాత్రం యూరియా పట్టుకుని వెళ్లి నిల్వ చేస్తున్నారని అంటున్నారు. అటువంటి వారిని గుర్తించి మిగిలిన రైతులుకు అందజేయాలని మిద్దే ఫణీంద్ర, వల్లభశెట్టి చైతన్య, మురళి, రాగు వీర్రాజు, శేషు కోరారు.

## మౌలిక వసతులపై అధికారులు దృష్టి సారించాలి

విశాలాంధ్ర - సీతానగరం/రాజానగరం: ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు పై అధికారులు దృష్టి సారించాలని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రాజానగరం నియోజకవర్గంలో ఉన్న మూడు మండలాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ, వారికి అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు వంటి అనేక రకాల సమస్యలు, పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యాలను వేగంగా చేరుకోవడానికి చేపట్టిన వినూత్న పద్ధతులలో పి4 పథకం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పథకం ద్వారా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను తక్కువ కాలంలో అందించడమే దీని యొక్క ముఖ్య ఉద్దేశమ న్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## హమ్మయ్య.., గోతులు పూడుస్తున్నారు...

విశాలాంధ్ర-తాళ్లపూడి : తాళ్లపూడి మండలంలోని ప్రక్కిలంక మార్టేరు రహదారి లో భాగమైన తాళ్లపూడి మండలం లోని పలు గ్రామాల్లో ఆర్ అండ్ బి రోడ్లు గోతులు మయమై ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షాల సమయంలో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్ అండ్ బి శాఖ మరమ్మతులు చేపట్టింది. మలకపల్లి నుంచి ప్రక్కిలంక వరకు ఉన్న గోతులు పుడుస్తున్నామని త్వరలో కొత్త రోడ్ వేసే అవకాశం ఉందని ఆర్ అండ్ బి ఏ.ఈ శ్రీనివాస్ తెలిపారు.

## జాబ్ మేళా

విశాలాంధ్ర, కొవ్వూరు : కొవ్వూరులో నిర్వహించిన 5వ జాబ్ మేళాను కొవ్వూరులోని ప్రభుత్వం డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాను శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి, కంఠమని రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

విశాలాంధ్ర - రావులపాలెం : ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే ప్రజల వినతులు స్వీకరించి, ప్రతి సమస్యపై కూలం కషంగా చర్చించారు. ఈ సందర్భంగా అనేక గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తాగునీరు, రోడ్లు, విద్యుత్, హౌసింగ్, పెన్షన్లు, రేషన్ వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రతి వినతిని వేగంగా పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశం చారు. ఈ ప్రజా దర్బార్‌లో 74 వినతులు వచ్చా యని ఎమ్మెల్యే బండారు తెలియజేసారు. వచ్చిన వినతులను త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## శాస్త్రికి సినారె దాశరథి అవార్డు పురస్కారం

విశాలాంధ్ర - కాట్రేనికోన : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకటించిన సినారే దాశరథి ఎక్సలెన్స్ అవార్డు 2025కు కాట్రేనికోనకు చెందిన ప్రముఖ వాస్తు జ్యోతిష సిద్ధాంతి, సామాజిక, సాహితీ సేవకుడు, ఫ్రెండ్లీ క్లబ్ వ్యవస్థాపకుడు ఆకొండి నాగరవీంద్ర జోగయ్య శాస్త్రి ఎంపికయ్యారు. ఎలైట్ ఆర్టిస్ట్ ఆడిటోరియం, హిమాయతనగర్, హైదరాబాద్‌లో గురువారం ఆయనను దృశ్యాలువ కప్పి ఘనంగా సత్కరించి పురస్కారం అందచేసారు. గౌరవ అతిథిగా సీనియర్ సినీనటుడు డా చింతకుంట మాణిక్యరావు, గౌరవ అధ్యక్షురాలు డా పివిపి అంజనీకుమారి, అధ్యక్షురాలు, ఫౌండర్ డా ఎన్ ఇందిర, ఉపాధ్యక్షుడు డా ఆలూరి విల్సన్, విశిష్ట అతిథి డా రామకృష్ణ చంద్రమౌళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్రెండ్లీక్లబ్ సభ్యులు, పలువురు అభిమానులు ఆకొండిని అభినందించారు.

## జానపద కళలను ప్రోత్సహిద్దాం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : మన సంస్కృతిలో భాగమైన జానపద కళలను ప్రోత్సహిద్దామని జానపద గాయకుడు, శ్రీ నటరాజ నిలయ చర్మాచిత్ర అధ్యక్షులు టి పవన్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద కళా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జానపద సాహిత్యం మన భారతీయులకు ఎంతో గర్వకారణమన్నారు. గత కొన్ని ఏళ్లుగా ప్రాచీన జానపద కళారూపం తోలుబొమ్మలాట, హరికథలు, బుర్రకథలు, జానపద నాట్యం ఇలా పలు విద్యలను తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చామన్నారు. ఇటీవల ఈటీవీ నిర్వహించే జబర్దస్త్‌లో పాల్గొన్నా మని పవన్ తెలిపారు. అనంతరం జానపద గేయాలను ఆలపించి తోలుబొమ్మలాట ప్రదర్శం చారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో పవన్ కుమార్ తదితరులను సత్కరించారు. నిమ్మకాయల వెంకటేశ్వ రరావు, ప్రసాద్ నాయుడు, పి ధర్మచంద్ర రాజు, ఎస్ నగేష్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

# వరద ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే దాట్ల పర్యటన

విశాలాంధ్ర - కాట్రేనికోన : వరద ప్రభావిత గ్రామాలైన గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠాణేలంకలలో శు క్రవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు పర్యటించారు. ముంపుకు గురైన గురజాపులంక గ్రామానికి స్వయంగా ఎమ్మెల్యే ట్రాక్టర్ నడుపుతూ కూటమి నాయకులను వెంట తీసుకువెళ్లారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద ప్రమాదం లేదని, తగ్గుముఖం పట్టిందని, భయాందోళనలు చెందవద్దన్నారు. కూటమి ప్రభుత్వం వరద బాధితులకు అండగా ఉండి ఆదుకుంటుందని ఎమ్మెల్యే దాట్ల

అభయమిచ్చారు. ఆయన వెంట సీనియర్ టిడిపి నాయకులు గుత్తుల సాయి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మాజీరావుకు నివాళి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : అనారోగ్యంతో అకాలమరణం చెందిన కట్టుంగ గ్రామ సర్పంచ్ కరుటూరి బ్రహ్మాజీరావు పార్థివదేహానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి భౌతికంగా హాజరై, స్వయంగా పార్థివదేహాన్ని మోసి గౌరవ నివాళులర్పించారు. బ్రహ్మాజీరావు గ్రామ అభివృద్ధి పట్ల ఉన్న కట్టుబాటు, ప్రజల పట్ల చూపిన సేవా దృక్పథం చిరస్మరణీయమైనవి. ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి, సన్నిహితులకు మన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

## చిరంజీవి జన్మదినోత్సవం

విశాలాంధ్ర - కరప : మండల కేంద్రం కరపలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కరప దుర్గగుడి సెంటర్‌లో జనసేన, సీనియర్ నాయకులు డాక్టర్ బొండ సూర్యరావు ఆధ్వర్యంలో భారీకేక్ కట్ చేసి, 50 మంది పంచాయతీ కార్మికులకు నిత్యావసర వస్తువులు అందించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, జనసేన నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని జన్మదిన వేడుకల్లో చిరంజీవి బ్లడ్‌బ్యాంక్, సామాజిక ఖ్యాతిని వర్ణించారు. కరప సొసైటీ అధ్యక్షులు సైనవరపు భీమశంకర్, కరప నీటిసంఘం(డిసి) అధ్యక్షులు పుణ్యమంతుల గంగ సత్యనారాయణ, కరప ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు, వేములవాడ సొసైటీ చైర్మన్ దూడల నారాయుడు, కరప సర్పంచ్ సాదే ఆశా జ్యోతి లోహిదాస్, కరప టీడీపీ అధ్యక్షులు దేవు వెంకన్న, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పదోన్నతులకు కృషి

విశాలాంధ్ర - కాకినాడ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి కృషి చేస్తానని ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జివిఆర్ఎస్ హెచ్‌కె వర్మ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం శుక్రవారం కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించవలసిందిగా కోరుట, గ్రంథాలయాల పనివేళలు పాఠకులకు అనుకూలంగా మార్చుట మరియు గ్రంథాలయాల్లో 3 సంవత్సరాలకు పైబడి వేలం వేయకుండా ఉంచిన పాత పత్రికల అమ్మకం తదితర అంశాలపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇంచార్జ్‌కి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి వినతి పత్రములు అందజేయుటకు తీర్మానం చేయడం జరిగింది. గౌరవ అధ్యక్షులు సలాది సాయి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి డొక్కా రాజు, అసోసియేట్ అధ్యక్షులు రేపాక వెంకట రాము, ఉపాధ్యక్షులు కే కిషోర్, మీడియా ప్రతినిధి ములంపాక శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ సలాది రాజు,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా చిరంజీవి జన్మదినోత్సవం

విశాలాంధ్ర-కాకినాడ : పద్మ విభూషణ్ డాక్టర్ చిరంజీవి జన్మదిన వేడుకలు కాకినాడలోని చాణిక్య చంద్రగుప్త థియేటర్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి యువత జనసేన నాయకులు నల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మెగా బ్రదర్ ఎమ్మెల్సీ నాగేంద్రబాబు భార్య పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మజాకు జనసేన నాయకులు డీసీసీ బ్యాంక్ అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), ఆకుల వెంకటరమణ తదితరులు హాజరై పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమాన్ని చేపట్టిన నల్లం శ్రీనివాస్ అతని మిత్రులను పద్మజ అభినందించారు. అనంతరం భారీ ఎత్తున కేక్ కట్ చేసి చిరు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి, పవన్ కళ్యాణ్ అభిమానులు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## జూనియర్ కళాశాలల్లో తాగునీటి సదుపాయం

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, సిబ్బందికి తాగునీటి సమస్యను అధిగమించే దిశగా కొత్త సదుపాయాన్ని కల్పించారు. కళాశాలలో 25 టాప్‌లతో కూడిన నాలుగు చోట్ల ఆధునిక తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశారు. ఈ సదుపాయాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, రావులపాలెం వాసి మల్లిడి తిరపారెడ్డి తమ తండ్రి మల్లిడి చంటబ్బాయి జ్ఞాపకార్థం రూ.1,59,000 వ్యయంతో ఏర్పాటు చేయడం విశేషం. ఈ తాగునీటి సదుపాయాల ప్రారంభోత్సవాన్ని కళాశాల చైర్మన్ పోతంశెట్టి కనకిరెడ్డి, దాతలు మల్లిడి తిరపారెడ్డి, మల్లిడి తీరపయ్య వెంకటరెడ్డి కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కెవి సత్యనారాయణరెడ్డి, టిడిపి నాయకుడు పడాల బులి కొండారెడ్డి, సిడిసి మెంబరు జక్కంపూడి రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిధులకు తోడుగా దాతల సహకారం అందడం వల్ల కళాశాలలో మౌలిక వసతులు మరింత మెరుగుపడుతున్నాయి. ఇటువంటి దాతృత్వం విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులు కూడా మాట్లాడి,

తాగునీటి సమస్య తొలగిపోవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి కె నరేష్ కుమార్ రెడ్డి, సిడిసి సభ్యులు కొవ్వూరి వెంకటరెడ్డి, కంచర్ల మాణిక్యాలరావు, సామాజిక కార్యకర్త డి వెంకటేశ్వర్లు, పెద్దలు పడాల కృష్ణారెడ్డి, కర్రి విశ్వేశ్వరరెడ్డి, సీనియర్ అధ్యాపకులు జివి రమణ, టి రాకేష్, రామారావు, గంగాదేవి నాగరాజు, విశ్వకనకం శ్రీనివాస్ రావు, సాగర్ సారథి, నూకరాజు, నాగేశ్వరరావు, రాంబాబు, సత్యనారాయణ, నారాయణరావు, విజయ్ కుమార్, నాగమణి, కనకదుర్గ, రాంపండు వెంకటేశ్వర్లు, రామచంద్ర రావు, బుల్‌రాజు, అధ్యాపకులు, ఆఫీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తడి,పొడి చెత్త పై అవగాహన

విశా లాంధ్ర - పెద పూడి : క్రమం తప్ప కుండా డిప్యూటీ ఎంపీ డీవో మేడ పాటి సత్యనారాయణరెడ్డి మండలంలో ఏదోక గ్రామంలో ఉదయం 6 గంటలకే శానిటేషన్ పనులు పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారా యణ రెడ్డి కుమార ప్రియం పంచాయతీ కార్యదర్శి సుంకర వీరాస్వామితో కలిసి గ్రామంలో కొత్తపేట, ఎస్సీ ఏరియాలో తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. పొడి చెత్తల్లో సీసాలు, డబ్బాలు, కలిపి, గాజు వంటి వస్తువులు తడి చెత్తల్లో వంటింట్లో నుంచి వచ్చే కూరగాయ తొక్కలు,టీ బ్యాగ్స్, పండ్ల వ్యర్థాలు వంటివని ప్రజలకు ఎంఎస్ఎన్ రెడ్డి, వీరాస్వామి వివరించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని ఎంఎస్ఎన్ రెడ్డి పేర్కొన్నారు.

## మెగాస్టార్ అభిమానులు రక్తదానం

విశాలాంధ్ర - కొత్తపేట : మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అభిమా నులు రక్తదానం చేసారు. ముందుగా కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్లో అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్స్ పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అమలాపురం ఏరియా ఆసుపత్రిలో యెలిశెట్టి మణికి అత్యవసరంగా రక్తం అవసరమైతే తోరాటి వెంకన్న, ముద్రగడ నాగ భూషణం, తదితరులు రక్తదానం చేశారు. ఈ వేడుకల్లో చిరంజీవి అభిమానులు విళ్ల వీర మారుతి ప్రసాద్, అమలాపురం డ్రగ్ యూనియన్ మోకా వెంకట సుబ్బారావు, నిమ్మకాయల చిన్నయ్య నాయుడు, ముద్రగడ దుర్గప్రసాద్, మొక శివ, చోడపనిడి శ్రీనివాస, పాలూరి జయప్రకాష్ నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

## ఓఎన్జీసీ పైప్ లైన్ లీకేజ్‌తో భారీ అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర - యానాం : యానాం నియోజకవర్గం పరిధిలో సముద్రం నుండి ఐలాండ్ నెంబర్ 3 మీదుగా వెళ్లిన ఓఎన్జిసి చమురు సంస్థల గ్యాస్ పైప్ లైన్ లీక్ అవ్వడంతో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. గురువారం అర్ధరాత్రి 2.30 సమయంలో ఒక్కసారిగా పైప్ లైన్ లీకేజ్ అవుతున్న ప్రాంతం నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సుమారు 30 అడుగులు పైబడి మంటలు కనిపించడంతో స్థానికులు భయాం దోళనకు గురయ్యారు. భారీగా ఎగిసిపడుతున్న మంటలతో సంఘటన జరిగిన ప్రాంతమంతా ఆకాశం ఎర్రగా మారిపోయింది. అర్ధరాత్రి సమ యంలో ఆ మంటలను చూసిన సమీప గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. యానాం శివారు సావిత్రినగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, భైరవపాలెం తదితర గ్రామాలు ప్రజలు ఒక్కసారిగా మంటలు వ్యాపిస్తున్న పరిస్థితిని చూసి ఏం జరిగిందో తెలియక ఆందోళనకు గురయ్యారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు స్థానిక నాయకులు ఈ విషయాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన వెంటనే స్పందించి ఓఎన్జిసి చమురు సంస్థలకు చెందిన ఉన్నత, సేఫ్టీ అధికారులతో ఫోన్లో మాట్లాడడంతో వెంటనే సంబంధిత అధికారులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. యానాం పరిపాలనాధికారి, పోలీసులు, ఇతర అధికారుల తోను సమీప గ్రామాల పెద్దలతో జరిగిన సంఘటన వివరించి తక్షణం సంఘటన ప్రాంతానికి వెళ్లాలని మల్లాడి అప్రమత్తం చేశారు. ఇదిలా ఉండగా గోదావరిలో పైప్ లైన్ లీకేజ్ వల్ల చమురు తెట్టు తేరుకుంటూ ఐ పోలవరం మండలం భైరవపాలెం వైపు చేరుకోవడంతో అక్కడ పడవలపై ఉన్న మత్స్య కారులు చమురుని డబ్బాలలో నింపుకు న్నారు. గోదావరిలో చమురు కలుషితం అవడం వల్ల చేపలు మృతి చెంది తేలిపోయాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

## త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - కడియం : రైతుల ప్రయోజనాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సహకార సంఘాల ద్వారా కొత్త పాలకవర్గాలు రైతుల సంక్షేమానికి కృషి చేయాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. కడియం మండలంలోని వేమగిరి, కడియం, మురమండ, కడియపులంక గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేమగిరి త్రిసభ్య కమిటీ అధ్యక్షులుగా డాక్టర్ వెలుగుబంటి వెంకటాచలం, కడియం త్రిసభ్య కమిటీ అధ్యక్షుడిగా వెలుగుబంటి రఘురాం (నాని), మురమండ త్రిసభ్య కమిటీ అధ్యక్షులుగా వట్టికూటి జానకి రామయ్య (దత్తుడు) అదేవిధంగా కడియపులంక త్రిసభ్య కమిటీ అధ్యక్షులుగా గట్టి నరసయ్య లతో ఎమ్మెల్యే గోరంట్ల ప్రమాణ స్వీకారాలు చేయించారు. ఆయన మాట్లాడుతూ కొత్త పాలకవర్గాలు సహకార సంఘాలను అభివృద్ధి దిశగా నడిపించాలని కోరారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రహదారుల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - కలిదిండి: రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మాత్యులు ఎన్.ఎండి ఫరూక్ తెలిపారు. శుక్రవారం కలిదిండి పెద్ద మసీదు వద్ద రూ 20.50 లక్షలు నిర్మించిన సిసి రోడ్ ను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని. శ్రీనివాస్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోడ్లకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ముస్లింల స్మశాన వాటికను పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరగా ఎంపీ నిధులతో నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. బస్టాండ్ వద్ద ఉన్న షాదీ ఖానాను పరిశీలించారు. కమ్మిలి. విటల్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోకల. జోగిరాజు, మాజీ ఎఎంసీ చైర్మన్ వల్లభనేని. శ్రీనివాస చౌదరి, అగ్నికుల క్షత్రియ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లు ఆంద్రాజు. శ్రీనివాసరావు, లంక రత్తయ్య, సర్పంచ్ మసి ముక్కుల మారుతి ప్రసన్న పాల్గొన్నారు.

# ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

విశాలాంధ్ర - అమలాపురం : ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించి వాటిని అధిక ధరలకు అమ్మడం చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై కఠిన చర్యలు గైకొనడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్ననాయుడు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎరువుల కృత్రిమ కొరత సరఫరా అంశాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని రకాల ఎరువులు రిక్వైర్మెంట్ 42 వేల మెట్రిక్ టన్నులు ఉండగా వీటిలో 32 వేల మెట్రిక్ టన్నులు సరఫరా కాబడిందని 14 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. 3800 మెట్రిక్ టన్నులు యూరియా, డిఏపి 700 మెట్రిక్ టన్నులు పొటాషియం 1000 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్ ఎరువులు 7600 మెట్రిక్ టన్నులు భాస్వరం 1200 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. ఈ నెలలో 6,000 టన్నులు సెప్టెంబర్ నెలలో 8,000 మెట్రిక్ టన్నుల ఎరువులు వస్తాయన్నారు. రబి సీజన్లో 71 వేలు జిల్లాకు సరఫరా అవకాశం ఉందన్నారు. ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించే ప్రైవేట్ డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత నిస్తుందనీ. జిల్లాలో రైతు సేవా కేంద్రాల 68, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు 73లలో ఎరువులు విక్రయాలతో పాటుగా ప్రైవేట్ డీలర్ల ద్వారా కూడా కొనసాగుతున్నాయన్నారు. రైతు సేవా కేంద్రాలు, పిఏసిఎస్‌లలో ధరలు తక్కువగా ఉండడం ప్రైవేట్ డీలర్ల దగ్గర రవాణా చార్జీల పేరిట అధిక చార్జీలు వసూలు చేయడంతో రైతుల నుండి వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో గతంలో 50:50 నిష్పత్తిలో ప్రభుత్వ మార్క్ఫెడ్, ప్రైవేటు విక్రయాలు నిష్పత్తిలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు తెచ్చిందని, ప్రస్తుతం 60 నిష్పత్తిలో మార్క్ ఫెడ్ (ప్రభుత్వ పరంగా) 40 నిష్పత్తిలో ప్రైవేట్ వారి ద్వారా విక్రయాలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్క్ఫెడ్ ఏడి మంజుల, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణ వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొట్టుకుపోయిన మూలస్థానం కాజ్ వే

విశాలాంధ్ర - రావులపాలెం : వరద నీరు అధికమవడంతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం వద్ద నూతనంగా నిర్మించిన కాజ్ వే కొట్టుకుపోయింది. శుక్రవారం ఉదయం ఒక్కసారిగా వరద లేదు పోటెత్తడంతో 21 తూరలతో నిర్మించిన ఈ కాజ్ వే పూర్తిగా వరదనీటి తాకిడికి ముక్కలుముక్కలుగా విడిపోయి తూరలన్నీ కొట్టుకుపోయాయి. ఈ కాజ్ వే అవతల ఉన్న రావులపాలెం మండలం ఊబలంక గ్రామ పంచాయతీకి చెందిన తోకలంక జల దిగ్బంధంలో ఉంది. అలాగే వందలాది ఎకరాల పంట భూములు ముంపుకు గురయ్యాయి. తోకలంకతో పాటు ఆలమూరు మండలం జొన్నాడ, మూలస్థానం, చొప్పెల్ల లంకలకు చెందిన పంట భూములు ముంపుకు గురయ్యాయి. పలు ఇటుక బట్టీలు కూడా వరద నీటిలో ఉన్నాయి. కొత్తపేట ఆర్డిఓ శ్రీకర్ కొట్టుకుపోయిన కాజ్ వే వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జలదిగ్బంధంలో ఉన్న తోకలంక ప్రజలు రాకపోకలు సాగించేందుకు నాలుగు పడవలు ఏర్పాటు చేశారు. అలాగే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను అక్కడే ఉన్న రావులపాలెం తాసిల్దార్ ముక్తేశ్వరరావు, ఎంపీడీవో మహేశ్వర రావు, రూరల్ సీఐ విద్యాసాగర్లతో ఆర్డిఓ చర్చించారు. అలాగే దారి పొడవునా వరద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఊబలంక పంచాయతీ కార్యదర్శి శరబరాజు, సచివాలయ కార్యదర్శి గోవింద రాజు, వీఆర్వోలు లక్ష్మీపతితావు, సంతోషిలు అక్కడే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులకు వివరిస్తున్నారు.

## స్వచ్ఛాంధ్రకు సిద్ధం కావాలి :జేసీ

విశాలాంధ్ర -భీమవరం: నేడు 4వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమా లకు సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నుండి జాయింట్ కలెక్టర్ శుక్రవారం రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులతో స్వర్ణాంధ్రకి పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, స్వచ్ఛ ఆంధ్ర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ వారం డ్రైన్ క్లీనింగ్, పారిశుధ్యం ప్రధానాంశంగా తీసుకున్నట్లు తెలిపారు. నీటి నిల్వలు లేకుండా చూడడం, దోమల నివారణకు మందులు స్ప్రే చేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వచ్ఛ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, అంగన్వాడీలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్ స్టేషన్, రైతు బజార్, హాస్టల్, పరిశ్రమ, బెస్ట్ స్వచ్ఛ ఎన్జీవో, బెస్ట్ వారియర్, బెస్ట్ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ కేటగిరిలలో అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేస్తుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వర్లు, సిపిఓ కె.శ్రీనివాస రావు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఆర్డీవో మల్లిబాబుకు అస్వస్థత

విశాలాంధ్ర - సామర్లకోట : కాకినాడ ఆర్డీవో మల్లిబాబు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. రేపు సీఎం చంద్రబాబు పర్యటన ఉండడంతో దాన్లో భాగంగా పలు పనులను పర్యవేక్షిస్తుండగా అస్వస్థతకు గురికావడంతో హుటా హుటిన సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. కారు దిగి నడవలేని స్థితిలో ఉండగా ఆయన సహాయకుడు ఇతరుల సహకారంతో ఆస్పత్రిలోకి వెళ్లగా వైద్యులు హుటాహుటిన వైద్య సహాయం అందించారు. బిపి, షుగర్, ఈసీజీ వంటి పలు టెస్టులు నిర్వహించారు. అనంతరం 108 లో కాకినాడ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. సామర్లకోట ఎమ్మార్వో కే చంద్రశేఖర్ రెడ్డి ఆసుపత్రికి వచ్చి ఆర్డీవో వెంట అంబులెన్స్‌లో కాకినాడ వెళ్లారు. విషయం తెలుసుకున్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సామర్లకోట ఆసుపత్రికి చేరుకునే సరికి ఆర్డీవో మల్లిబాబును కాకినాడ తరలించడంతో అక్కడ ఉన్న డాక్టర్లను ఆర్డిఓ మల్లిబాబు ఆరోగ్యంపై ఆరా తీసి ఎమ్మెల్యే కాకినాడ ఆసుపత్రికి తరలి వెళ్లారు.

## సీఐ నరేష్ కుమార్ చేయూత

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు మండలం ములికిపల్లి గ్రామానికి చెందిన ఇంగువ లక్ష్మీ వినయ్ కుమార్ నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం చేయించడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న రాజోలు సిఐ టివి. నరేష్ కుమార్ తనవంతు సాయంగా వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.10,000 ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. సిఐ మాట్లాడుతూ భవిష్యత్తులో వారికి ఏ అవసరం వచ్చిన సహాయం చేస్తానని, స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి సహాయం చేస్తానని సీఐ నరేష్ కుమార్ హామీ ఇచ్చారు.

## సాంకేతిక నైపుణ్యాలతోనే యువత సాధికారిత

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: సాంకేతిక నైపుణ్యాలతోనే యువత సాధికారిత సాధ్యమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ కెరీర్ అలుమ్ని అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ జీబి వీరేశ్ కుమార్ సూచించారు. ఫోర్డ్ అలుమినస్ ఆధ్వర్యంలో ఏపీ నిట్, శశి ఇంజినీరింగ్ కళాశాల భాగస్వామ్యంతో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఫోర్డ్ ఇన్‌స్పైర్ ఏ కెరీర్ అండ్ కార్పొరేట్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిట్ విద్యా సంస్థల్లో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరేశ్ కుమార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆధునిక సాంకేతిక రంగంలో సమకాలీన, సృజనాత్మక ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టిసారించాలని వివరించారు. మెర్సిడెస్ బెంజ్ కంపెనీ సీనియర్ ఇంజినీర్ (బెంగళూర్) అయ్యర్ భట్టాచార్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమైనదని తెలిపారు. టి హబ్ డైరెక్టర్ (హైదరాబాద్) అవినాష్ కేదార్ మాట్లాడు తూ అంకుర పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ప్రోత్సాహలిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకునే స్థాయికి విద్యార్థులు ఎదగాలని వివరించారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్ గా వ్యవహరించిన, ట్రెనింగ్ ప్లేస్ మెంట్ సెల్ అసోసియేట్ డీన్ డాక్టర్ పి.శంకర్ మాట్లాడుతూ ఈ ఫెస్ట్ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలలోని పలు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించటం గొప్ప విశేషమని వివరించారు. ఫోర్డ్ అలుమినస్ కంపెనీ ప్రతినిధి రేణికుంట్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రయివేటు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు, కృత్రిమ మేధ పనితీరు, కోడింగ్ సవాళ్లు, సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ ఇంజినీరింగ్ వంటి అంశాల గురించి వివరించారు. అమెజాన్, డెలాయిట్, మెర్సిడేస్ బెంజ్, ఫ్యూజీ టెక్, గూగుల్ డెవలపర్స్ వంటి 23 కంపెనీల ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

## రూరల్ ఇన్‌ఛార్జ్‌ను నియమించండి

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కాకినాడ రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మధ్య విభేదాలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 49 గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు కలిసి రాజ్యసభ సభ్యులు ఎంపీ సానా సతీష్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో కార్యాలయ ఇంచార్జి మేకా లక్ష్మణ్ రావుకి, పిఠాపురం ఇన్చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్ వర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పార్టీ అధిష్టానం పిల్లి సత్యనారాయణ మూర్తిని కోఆర్డినేటర్‌గా, కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ)ని కో-కోఆర్డినేటర్‌గా నియమించిందని తెలిపారు. అయితే బాబీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం కృషి చేస్తూ తన ప్రలోభాలకు ఆకర్షితులైన సుమారు పది మంది కార్యకర్తలను తనవైపు తిప్పుకొని గ్రూప్ రాజకీయాలకు తెరలేపడంతో నియోజకవర్గంలోని 49 గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నేతలు అంతా కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్యనారాయణమూర్తి అనంతలక్ష్మి దంపతులతో కలసి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్టీ కార్యక్రమాల్లో పనిచేయడం జరిగిందన్నారు. కో ఆర్డినేటర్ బాబి తన వద్ద ఉన్న ఆ పది మంది అనుచరులతో పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులపై లేనిపోని ఆరోపణలు చేయించడం, కంప్లైంట్లు విభేదాలకు కారణమవుతోందన్నారు. ఈ సందర్భాల్లో మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్యనారాయణమూర్తి (సత్తిబాబు) తమను క్రమశిక్షణలో ఉంచి, ఇతర పార్టీల వద్ద తాము చులకన కాకుండా నిలిపేవారన్నారు. అందువలనే తాము ఏనాడు పిల్లి సత్యనారాయణమూర్తి మాట కాదని ఎవరిపైనా విమర్శలకు పునుకోలేదన్నారు. పిల్లి దంపతులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ నాయకులుగా చెలామణి అయ్యేవారు తమకు ఆ నాయకత్వం ఎవరి వలన వచ్చిందో గుర్తెరిగి మాట్లాడాలని హితవు పలికారు. నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఈ పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకుంటూ, వ్యక్తిగత వర్గాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని కార్యకర్తలు ఆరోపించారు. కాకినాడ రూరల్‌లో విభేదాలకు కారణమవుతున్న కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), పరిశీలకుడు కుడుపూడి సత్తిబాబును తప్పించాలని డిమాండ్ చేస్తూ అధిష్టానం ఇప్పటికైనా నిర్ణయం తీసుకుని నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌ను నియమించాలంటూ రాష్ట్ర పార్టీ నాయకత్వాన్ని కోరుతున్నామని కార్యకర్తలు స్పష్టం చేశారు. వివిధ గ్రామాలకు చెందిన గండి వెంకటేశ్వర రావు, కొండా వినాయక్,జక్కి అప్పన్న, గుబ్బల సత్య శివ లింగం, మాత లక్ష్మణ్, కోడి సీతారామయ్య, రామసత్యనారాయణ, పంపన కన్నరావు గొల్లపల్లి త్రిమూర్తులు, కేసుబోయిన ఏడుకొండలు, పెండెం శ్యామ్, గొల్లపల్లి లక్ష్మి, ఓరిపల్లి విజయ్, కమ్మ శ్రీను, మెడిశెట్టి లోవ బాబు, పట్టెం వెంకటేష్, వాసంశెట్టి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.